వనం..మనం.. మనఊరి కోసం
RNI/APTEL/26/A3829
ప్రభ మనం
TELUGU DAILY
తెలుగు డైలీ
Gmail: prabhamanam@gmail.com

విలేకరులు కావలెను.
WANTED... WANTED...
ఆంధ్ర, తెలంగాణ నుండి వెలువడుతున్న తెలుగు జాతీయ దినపత్రిక ప్రభ మనం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు అన్ని జిల్లాల వారిగా స్టాఫ్ రిపోర్టర్లు, ఆర్సీ ఇంచార్జ్‌లు, సీసీ ఇంచార్జ్‌లు మరియు మండల విలేకరులు కావలెను.
ఆసక్తి ఉన్నవారు సంప్రదించండి.
ఎడిటర్: వి. లింగమూర్తి
9000367833, 8074937223

కర్నూలు : ఎడిటర్ - వడ్డే లింగమూర్తి | సంపుటి : 1 సంచిక : 85 | పేజీలు : 4 వెల రూ./-4 | email: prabhamanam@gmail.com శుక్రవారం 14- 08 - 2026

## లష్కరే తోయిబా నేతలతో కలిసి వేదిక పంచుకున్న రషీద్

- హఫీజ్ సయీద్‌కు నేను బానిస అంటూనే భారత్‌కు పాకిస్థాన్ మాజీ మంత్రి బెదిరింపులు
- ఉగ్రవాది హఫీజ్ సయీద్‌కు తాను బానిసనన్న పాక్ మాజీ మంత్రి షేక్ రషీద్
- పాకిస్థాన్ వైపు చూస్తే భారత్‌లో పక్షులు కూడా కూయవంటూ హెచ్చరిక
- రషీద్ వ్యాఖ్యల వీడియో సోషల్ మీడియాలో వైరల్.. విమర్శల వెల్లువ



పాకిస్థాన్ మాజీ మంత్రి షేక్ రషీద్ అహ్మద్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం తీవ్ర దుమారం రేపుతున్నాయి. ముంబై ఉగ్రదాడుల సూత్రధారి, లష్కరే తోయిబా (ఎల్ఈటీ) వ్యవస్థాపకుడు హఫీజ్ సయీద్‌కు తాను 'గులాం'ను (బానిసను) అని ఆయన బహిరంగంగా ప్రకటించారు. లష్కరే తోయిబా - మిగతా 2 లో

## 250 రోజులుగా సముద్రంలోనే అమెరికా యుద్ధనౌకలో ఏం జరుగుతోంది?

- 9 నెలలుగా సముద్రంలోనే యూఎస్ఎస్ అబ్రహం లింకన్ నౌక
- 250 రోజులు తీరానికి దూరంగా ఉన్న నౌకలోని సిబ్బంది
- నావికులు ఆత్మహత్యాయత్నాలకు పాల్పడినట్లు కుటుంబాల ఆవేదన
- సుదీర్ఘ మోహరింపుతో తీవ్ర మానసిక ఒత్తిడిలో సిబ్బంది
- నీరు, ఆహారం, పారిశుద్ధ్యంపైనా కుటుంబాలు ఫిర్యాదు



ఇరాన్‌తో యుద్ధం నేపథ్యంలో అమెరికా యుద్ధనౌక యూఎస్ఎస్ అబ్రహం లింకన్ సిబ్బంది తీవ్ర ఒత్తిడికి గురవుతున్నారు. దాదాపు తొమ్మిది నెలలుగా సముద్రంలోనే ఉన్న నౌకలో పలువురు నావికులు ఆత్మహత్యాయత్నాలకు - మిగతా 2 లో

# గతంలో కోర్టుకెళ్లిన మీరేఇప్పుడు అవే భూములను ఎలా వేలం వేస్తారు?

- రాయదుర్గం భూముల వేలం తక్షణమే ఆపాలని సీఎంకు హరీశ్ రావు లేఖ
- అవి వారసత్వ, వివాదాస్పద భూములని లేఖలో స్పష్టీకరణ
- గతంలో ఇదే భూముల కోసం కోర్టుకెక్కిన రేవంత్ రెడ్డిని నిలదీసిన హరీశ్
- యాజమాన్య హక్కులు తేలకుండా వేలం వేయడంపై తీవ్ర అభ్యంతరం
- ఎస్సీఐ, వక్ఫ్ బోర్డు కేసుల నేపథ్యంలో వేలం నిర్ణయంపై విమర్శలు




హైదరాబాద్ ఐటీ కారిడార్‌లోని అత్యంత విలువైన రాయదుర్గంలో 10.63 ఎకరాల వారసత్వ భూమి వేలాన్ని తక్షణమే నిలిపివేయాలని బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు డిమాండ్ చేశారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశం



- శ్రీరామకుంట వైకుంఠధామాన్ని ఆహ్లాదకరమైన పార్కు తరహాలో తీర్చిదిద్దుతున్నాం: హరీశ్ రావు
- సిద్దిపేట శ్రీరామకుంట వైకుంఠధామం పనులను పర్యవేక్షించిన హరీశ్
- పనులు జరుగుతున్న తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన మాజీ మంత్రి

సిద్దిపేట శ్రీరామకుంట వైకుంఠధామాన్ని సరికొత్త రీతిలో ఒక ఆహ్లాదకరమైన పార్కు - మిగతా 2 లో

## చంచల్‌గూడ స్టీల్ బ్రిడ్జ్‌కు సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలి



- చంచల్‌గూడ నుంచి సంతోష్‌నగర్ వరకు కొత్త స్టీల్ బ్రిడ్జ్
- సంగం లక్ష్మీబాయి సేవలు చరిత్రలో మరువరానివన్న వీహెచ్
- మూడుసార్లు ఎంపీగా గెలిచిన తొలి మహిళగా రికార్డు సృష్టించారని కితాబు

హైదరాబాద్ నగర పరిధిలోని చంచల్‌గూడ నుంచి సంతోష్‌నగర్ వరకు నూతనంగా నిర్మించిన స్టీల్ బ్రిడ్జ్‌కు - మిగతా 2 లో

## విదేశాంగ విధానమంటే ఆలింగనాలు కాదు




- ప్రధాని నరేంద్ర మోదీ తీరుపై రాహుల్ గాంధీ ఘాటు విమర్శలు
- వేదికపైనే కాంగ్రెస్ నేతను కౌగిలించుకుని సెటైర్
- చైనా, ఇరాన్ విషయంలో భారత వైఖరిని తప్పుపట్టిన రాహుల్
- బీజేపీ, ఆరెస్సెస్‌ను జోకర్ల బృందంగా అభివర్ణన

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అనుసరిస్తున్న విదేశాంగ విధానంపై లోక్‌సభ ప్రతిపక్ష నేత - మిగతా 2 లో

# సభలో తొలిసారి వందేమాతరం ఆరు చరణాల ఆలాపన

- ముగిసిన వర్షాకాల సమావేశాలు
- పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా గురువారం లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది
- ఈ రోజు లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు
- ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు.




పార్లమెంట్ వర్షాకాల సమావేశాల్లో భాగంగా గురువారం లోక్‌సభ నిరవధికంగా వాయిదా పడింది. ఈ రోజు లోక్‌సభ ప్రారంభమైన తర్వాత సభ్యులంతా కలిసి వందేమాతరం గేయాన్ని ఆలపించారు.

## ఖర్గే సభ జరిగిన చోట 'శుద్ధి' రాజ్యసభలో రగడ నడ్డా ఏమన్నారంటే..!



- ఖర్గే సభ జరిగిన చోట శుద్ధీకరణ హోమం
- రాజ్యసభలో ఖర్గే తీవ్ర అభ్యంతరం
- ఘటన దురదృష్టకరమన్న కేంద్ర మంత్రి జేపీ నడ్డా
- బీజేపీకి ఆ కార్యక్రమంతో సంబంధం లేదన్న నడ్డా
- ఘటనపై విచారణ జరుపుతామని హామీ

కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సభ నిర్వహించిన ప్రదేశంలో 'శుద్ధీకరణ' పేరుతో హోమం - మిగతా 2 లో


## ఇవాళ జైలులో నన్ను కూడా అవమానించారు



- కర్నూలు జైలులో ఎమ్మెల్యే విరూపాక్షిని పరామర్శించిన జగన్
- చంద్రబాబు రెడ్ బుక్ పాలనతో ప్రతిపక్షాన్ని అణిచివేస్తున్నారని ఆరోపణ
- బాధితులే నిందితులుగా మారుతున్నారని, విరూపాక్షి ఘటనే ఉదాహరణ అన్న జగన్
- బీసీ, మైనారిటీ నేతలను లక్ష్యంగా చేసుకుని కేసులు పెడుతున్నారని విమర్శ
- తాను నాటిన తప్పుడు విత్తనాలే రేపు చంద్రబాబును చుట్టుకుంటాయని హెచ్చరిక

రాష్ట్రంలో అధికార దుర్వినియోగం ఏ స్థాయిలో ఉందో చెప్పడానికి ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి - మిగతా 2 లో

## ఖర్గేకు అవమానం రాష్ట్రవ్యాప్త నిరసనలకు షర్మిల పిలుపు



- ఖర్గే పర్యటించిన స్థలాన్ని శుద్ధి చేయడంపై షర్మిల తీవ్ర ఆగ్రహం
- ఇది దళితుల వ్యక్తిత్వానికి జరిగిన అవమానమంటూ విమర్శ
- బీజేపీ కుల వివక్షకు, విభజన రాజకీయాలకు నిదర్శనమని ఆరోపణ
- ఆగస్టు 14న రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు, సత్యాగ్రహానికి పిలుపు

కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేకు అవమానం - మిగతా 2 లో

# సీడ్ యాక్సెస్ రోడ్డు.. నూతన స్టీల్ బ్రిడ్జిని ప్రారంభించిన చంద్రబాబు

- సీడ్ యాక్సెస్ రోడ్డు, స్టీల్ బ్రిడ్జి ప్రారంభోత్సవం
- అమరావతి రైతులది త్యాగం మాత్రమే కాదు.. భవిష్యత్ తరాలకు స్ఫూర్తి అన్న చంద్రబాబు
- శూన్యం నుంచి గొప్ప రాజధానిని నిర్మించుకునే స్థాయికి చేరుకున్నామని వ్యాఖ్య
- గ్రాఫిక్స్ అన్నవాళ్లు ఇక్కడకు వచ్చి చూడాలన్న చంద్రబాబు




ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో మరో సువర్ణాధ్యాయం ఆవిష్కృతమైంది. రాజధాని రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే ఈ-3 సీడ్ యాక్సెస్ రోడ్డు రెండో దశతో పాటు, విజయవాడ-మంగళగిరి హైవేను

ప్రభ మనం TELUGU DAILY RNI/APTEL/26/A3829 Gmail: prabhamanam@gmail.com



## ఖర్గేకు అవమానం.. రాష్ట్రవ్యాప్త నిరసనలకు షర్మిల పిలుపు

మొదటిపేజీ తరువాయి – జరిగిందంటూ, బీజేపీపై ఏపీ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానిలో ఖర్గే పాల్గొన్న సభా ప్రాంగణాన్ని బీజేపీ, హిందుత్వ సంస్థలు గంగాజలంతో శుద్ధి చేయడంపై ఆమె తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇది బీజేపీ కుల దురహంకారానికి, దళిత వ్యతిరేక విధానాలకు నిదర్శనమని ఆరోపిస్తూ రేపు (ఆగస్టు 14) రాష్ట్రవ్యాప్తంగా నిరసనలకు పిలుపునిచ్చారు. ఈ ఘటనపై షర్మిల తీవ్రంగా స్పందించారు. "బీజేపీ చేసిన హవనం.. దళితుల వ్యక్తిత్వానికి జరిగిన హననం" అని ఆమె అభివర్ణించారు. దళితుల పట్ల వివక్ష చూపడమే బీజేపీ సిద్ధాంతమని, కులమతాల మధ్య విభేదాలు సృష్టించడం ఆ పార్టీ మనస్తత్వమని విమర్శించారు. రామ్ లీలా మైదానంలో ఖర్గే అడుగుపెట్టిన స్థలాన్ని శుద్ధి చేయడం బీజేపీ పాటిస్తున్న అంటరానితనానికి, అసమానతలకు అద్దం పడుతుందని ఆమె మండిపడ్డారు. ఇది సభ్యసమాజం సిగ్గుతో తలవంచుకోవాల్సిన చర్య అని, రాజ్యాంగ విలువలను తునాతునకలు చేసే ఈ రాక్షస చర్యను యావత్ దేశం ఖండిస్తోందని తెలిపారు. ఈ సిగ్గుమాలిన చర్యను నిరసిస్తూ దేశవ్యాప్తంగా కాంగ్రెస్ ఉద్యమిస్తోందని, అందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌లోనూ నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు షర్మిల ప్రకటించారు. ఆగస్టు 14వ తేదీ సాయంత్రం ప్రతి జిల్లా కేంద్రంలో డిస్ట్రిక్ట్ కాంగ్రెస్ కమిటీ (డీసీసీ) ఆధ్వర్యంలో భారీ మార్చ్, సత్యాగ్రహం నిర్వహించాలని ఆమె పార్టీ శ్రేణులకు విజ్ఞప్తి చేశారు. ఈ మార్చ్‌ను స్థానిక అంబేడ్కర్ లేదా గాంధీ విగ్రహాల వద్ద ముగించి, ఖర్గేకు సంఘీభావంగా సత్యాగ్రహం చేపట్టాలని సూచించారు. ఈ కార్యక్రమాల్లో డీసీసీ, బ్లాక్ కాంగ్రెస్ కమిటీలు, పార్టీ అనుబంధ విభాగాలు, నాయకులు, కార్యకర్తలు భారీగా పాల్గొని విజయవంతం చేయాలని షర్మిల కోరారు. ఇటువంటి వివక్ష, విభజన కుట్రలను దేశ ప్రజలు సహించబోరని బీజేపీకి శక్తివంతమైన సందేశం పంపాలని ఆమె పిలుపునిచ్చారు.

## సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని అధికారులకు ఆదేశం

మొదటిపేజీ తరువాయి – తరహాలో తీర్చిదిద్దుతున్నామని మాజీ మంత్రి, స్థానిక బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీశ్ రావు తెలిపారు. సిద్దిపేట పట్టణ పరిధిలోని శ్రీరామకుంట శ్మశానవాటికలో సాగుతున్న సుందరీకరణ పనులను ఆయన ఈరోజు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అక్కడ జరుగుతున్న అభివృద్ధి పనుల తీరుపై సంతృప్తి వ్యక్తం చేసిన ఆయన... మిగిలిన పెండింగ్ పనులను వేగవంతం చేయాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. శ్మశానవాటిక ప్రాంగణంలో పచ్చదనం పెంచేలా మరిన్ని మొక్కలు నాటాలని హరీశ్ సూచించారు. ప్రజల రాకపోకలకు వీలుగా సీసీ రోడ్లు, భద్రత కోసం సీసీ కెమెరాలను ఏర్పాటు చేయాలని చెప్పారు. ముఖ్యంగా రాత్రి వేళల్లో దహన సంస్కారాల కోసం వచ్చే ప్రజలు వెలుతురు లేక ఇబ్బందులు పడుతున్న దృష్ట్యా... వెంటనే సరైన లైటింగ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తేవాలని ఆదేశించారు. వీటితో పాటు టాయిలెట్లకు తక్షణమే మరమ్మతులు చేపట్టి శుభ్రత ఉండేలా చూడాలన్నారు. పర్యావరణహిత పద్ధతిలో బయోగ్యాస్ ద్వారా దహన సంస్కారాలు నిర్వహించేలా చేపట్టిన పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను కోరారు.

## చంచల్‌గూడ స్టీల్ బ్రిడ్జ్‌కు సంగం లక్ష్మీబాయి పేరు పెట్టాలి

మొదటిపేజీ తరువాయి – ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధురాలు, విద్యావేత్త సంగం లక్ష్మీబాయి పేరుతో నామకరణం చేయాలని తెలంగాణ ప్రభుత్వ సలహాదారు, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు వి.హనుమంతరావు కోరారు. ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ప్రత్యేకంగా లేఖ రాశారు. భారత స్వాతంత్ర్య పోరాటంలో, ఆ తర్వాత సమాజ సేవలో సంగం లక్ష్మీబాయి అందించిన నిరుపమాన సేవలు చరిత్రలో మరపురానివని వీహెచ్ తన లేఖలో పేర్కొన్నారు. తెలంగాణ నేలకు చెందిన వీరనారిగా, నిజాం నిరంకుశత్వానికి, రజాకార్ల అరాచకాలకు వ్యతిరేకంగా ఉద్యమించడమే కాకుండా, ఉప్పు సత్యాగ్రహంలో పాల్గొని జైలు శిక్ష కూడా అనుభవించారని పేర్కొన్నారు. స్వాతంత్ర్యానంతరం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తొలిసారిగా అల్వాల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, ఉప విద్యామంత్రిగా సేవలు అందించారని, మెదక్ స్థానం నుంచి వరుసగా మూడుసార్లు ఎంపీగా గెలిచి పార్లమెంట్‌లో అడుగుపెట్టిన తొలి మహిళగా రికార్డు సృష్టించారని వివరించారు. సైదాబాద్‌లో 'ఇందిరా సేవా సదన్' నెలకొల్పి వేలాది మంది పేద బాలికలకు ఆశ్రయం, విద్య అందించిన మహోన్నత వ్యక్తి ఆమె అని తెలిపారు. ప్రస్తుతం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దే విద్యాశాఖ ఉన్నందున, గతంలో విద్యాశాఖ మంత్రిగా సేవలందించిన సంగం లక్ష్మీబాయి పేరును చంచల్‌గూడ – సంతోష్‌నగర్ స్టీల్ బ్రిడ్జ్‌కు నామకరణం చేస్తే ప్రజామోదం లభించడంతో పాటు ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని వీహెచ్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ విజ్ఞప్తిపై తెలంగాణ ప్రభుత్వం సానుకూలంగా స్పందించి తగిన నిర్ణయం తీసుకోవాలని సీఎంను కోరారు.

## విదేశాంగ విధానమంటే ఆలింగనాలు కాదు

మొదటిపేజీ తరువాయి – రాహుల్ గాంధీ తీవ్ర విమర్శలు గుప్పించారు. ప్రపంచ దేశాల అధినేతలను ఆలింగనం చేసుకోవడం, వ్యక్తిగత స్నేహాలను ప్రదర్శించడం విదేశాంగ విధానం అనిపించుకోదని, దేశ ప్రయోజనాలను కాపాడటమే అసలైన దౌత్యమని ఆయన స్పష్టం చేశారు. గురువారం ఢిల్లీలో జరిగిన 'రచనాత్మక్ కాంగ్రెస్' జాతీయ సదస్సులో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. విదేశాంగ విధానమంటే విదేశీ నేతలను కౌగిలించుకోవడమన్న ఆలోచన మోదీకి ఎక్కడి నుంచి వచ్చిందో అర్థం కావడం లేదని రాహుల్ గాంధీ ఎద్దేవా చేశారు. ఈ సందర్భంగా తన వాదనను వివరించేందుకు వేదికపై ఉన్న రచనాత్మక్ కాంగ్రెస్ చీఫ్ సందీప్ దీక్షిత్‌ను ఆయన ఆలింగనం చేసుకున్నారు. తన నాయనమ్మ, మాజీ ప్రధాని ఇందిరా గాంధీతో కలిసి బాల్యంలో అమెరికా వెళ్లిన సందర్భాన్ని గుర్తుచేసుకుంటూ, దేశాధినేతల అధికారిక పర్యటనలు వ్యక్తిగత పర్యటనలు వంటివి కావని ఆయన పేర్కొన్నారు. ఇరాన్, అమెరికా, రష్యాలతో భారత్‌కు సుహృద్భావ సంబంధాలు ఉన్నప్పటికీ, ఇరాన్ వివాదంలో మధ్యవర్తిత్వం వహించే అరుదైన అవకాశాన్ని భారత్ కోల్పోయిందని రాహుల్ గాంధీ ఆరోపించారు. అరుణాచల్ ప్రదేశ్‌లోని కొన్ని సరిహద్దు ప్రాంతాల్లో భారత సైన్యం పెట్రోలింగ్‌ను చైనా అడ్డుకుంటోందని, గల్వాన్ ఘర్షణల విషయంలో కేంద్ర ప్రభుత్వ వైఖరి దేశాన్ని బలహీనపరిచిందని ఆయన విమర్శించారు. బీజేపీ, రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆరెస్సెస్)లను ఒక 'జోకర్ల బృందం'గా అభివర్ణించిన రాహుల్ గాంధీ, ఆ సంస్థలు దేశంపై ఏకపక్ష రాజకీయ వ్యవస్థను రుద్దేందుకు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. ఇదే కార్యక్రమంలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, పార్లమెంటులో ప్రతిపక్షాల గొంతును ప్రభుత్వం విస్మరిస్తోందని మండిపడ్డారు.

## లష్కరే తోయిబా నేతలతో కలిసి వేదిక పంచుకున్న రషీద్

మొదటిపేజీ తరువాయి – కీలక నేతలతో వేదికను పంచుకుంటూనే, భారత్‌ను ఉద్దేశించి ఆయన తీవ్ర హెచ్చరికలు జారీ చేశారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఒక బహిరంగ సభలో ప్రసంగించిన షేక్ రషీద్, "నేను హాఫీజ్ సాహెబ్‌కు బానిసను" అని వ్యాఖ్యానించారు. తన మొబైల్ ఫోన్‌లో హాఫీజ్ సయీద్ ఫోన్ నంబర్ ఉన్నందునే అమెరికా తనపై నిషేధం విధించిందని ఆయన పేర్కొన్నారు. లష్కరే తోయిబా సీనియర్ కమాండర్ ఖలీద్ మసూద్ సంధు, సలహా కమిటీ సభ్యుడు కారీ మహ్మద్ యాకూబ్ షేక్‌లతో కలిసి ఆయన వేదికపై కనిపించడం గమనార్హం. ఇదే సభలో భారత్‌ను ఉద్దేశించి రషీద్ విద్వేషపూరిత వ్యాఖ్యలు చేశారు. "భారత్ గనుక పాకిస్థాన్ వైపు కన్నెత్తి చూస్తే సర్వనాశనమవుతుంది. ఆ తర్వాత భారత్‌లో ఏ పక్షీ కూయదు, ఏ గుడిలోనూ గంట మోగదు" అంటూ రెచ్చగొట్టేలా హెచ్చరించారు. పాకిస్థాన్‌తో పాటు హాఫీజ్ సయీద్‌కు తాను పూర్తి మద్దతు ఇస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. షేక్ రషీద్ 2020 నుంచి 2022 వరకు ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వంలో అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రిగా బాధ్యతలు నిర్వర్తించారు. బాధ్యతాయుతమైన పదవిలో పనిచేసిన ఒక మాజీ మంత్రి, ఐక్యరాజ్యసమితి నిషేధిత ఉగ్రవాదికి బహిరంగంగా మద్దతు పలకడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ ఉదంతం పాకిస్థాన్ ద్వంద్వ వైఖరిని మరోసారి ప్రపంచానికి చాటిచెప్పిందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

## ఖర్గే సభ జరిగిన చోట 'శుద్ధి'.. రాజ్యసభలో రగడ.. నడ్డా ఏమన్నారంటే..!

మొదటిపేజీ తరువాయి – చేయడం రాజకీయ దుమారం రేపింది. ఈ అంశం గురువారం రాజ్యసభను కుదిపేసింది. ఖర్గే తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేయగా.. కేంద్ర మంత్రి జేపీ నడ్డా స్పందించారు. ఈ ఘటన దురదృష్టకరమని పేర్కొన్నారు. బీజేపీ ఇలాంటి చర్యలను సమర్థించదని స్పష్టం చేశారు. ఉత్తరాఖండ్‌లోని హల్ద్వానీ రామ్‌లీలా మైదానంలో ఆగస్టు 8న ఖర్గే 'విజయ శంఖనాద' సభ నిర్వహించారు. రెండు రోజుల తర్వాత శ్రీరామ్ సేనకు చెందిన కార్యకర్తలు అక్కడ హోమం చేసి వేదికను 'శుద్ధి' చేసినట్లు వార్తలు వచ్చాయి. దీంతో కాంగ్రెస్ తీవ్రంగా మండిపడింది. రాజ్యసభలో ఖర్గే మాట్లాడుతూ.. తన సభకు లక్షలాది మంది హాజరయ్యారని చెప్పారు. తాను ఏ మతం లేదా వర్గం గురించి మాట్లాడలేదన్నారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపైనే మాట్లాడానని తెలిపారు. అయినా తన ప్రసంగం తర్వాత వేదికకు శుద్ధి చేయడం ఏంటని ప్రశ్నించారు. ఇది ప్రజాస్వామ్య పద్ధతేనా? రాజ్యాంగాన్ని ఎలా కాపాడుతున్నారని నిలదీశారు. ఈ ఘటనను ఖండించిన రాజ్యసభ ఛైర్మన్.. అంటరానితనం కంటే పెద్ద పాపం మరొకటి లేదని వ్యాఖ్యానించారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని సూచించారు. ఖర్గే దళితుడు కావడంతోనే శుద్ధి చేశారని ఉత్తరాఖండ్ కాంగ్రెస్ అధ్యక్షుడు గణేశ్ గోదియాల్ ఆరోపించారు. దీనికి బీజేపీ రాష్ట్ర నేత ఖజన్ దాస్ స్పందించారు. ఖర్గే సభలో చేసిన కొన్ని నినాదాలు సనాతన వర్గాల మనోభావాలను దెబ్బతీశాయని చెప్పారు. రామ్‌లీలా మైదానం మతపరమైన ప్రాధాన్యం ఉన్న ప్రాంతమని తెలిపారు. శుద్ధి కార్యక్రమంతో బీజేపీకి సంబంధం లేదని నడ్డా స్పష్టం చేశారు. ఘటనపై విచారణ జరుపుతామని హామీ ఇచ్చారు.

## ఇవాళ జైలులో నన్ను కూడా అవమానించారు

మొదటిపేజీ తరువాయి – అరెస్టు ఘటనే నిలువెత్తు నిదర్శనమని వైసీపీ అధినేత జగన్ అన్నారు. కర్నూలు జిల్లా జైలులో రిమాండ్‌లో ఉన్న ఎమ్మెల్యే విరూపాక్షిని గురువారం ఆయన ములాఖత్‌లో భాగంగా కలిశారు. అనంతరం జైలు బయట మీడియాతో మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి చంద్రబాబు 'రెడ్ బుక్' రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. తాను ఇవాళ జైలుకు వస్తే తనను కూడా అవమానించే ప్రయత్నం చేశారని జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. "ఒక మాజీ ముఖ్యమంత్రిగా వచ్చిన నన్ను లోపల కూర్చోబెట్టి ఫోటో తీయకుండా, గ్రిల్స్ బయట నిలబెట్టి ఫోటో తీశారు. ఇది చంద్రబాబు శాడిస్టిక్ మనస్తత్వానికి నిదర్శనం. మా హయాంలో పీపుల్ ఫ్రెండ్లీ పోలీస్ స్టేషన్లు తీసుకొస్తే, వీళ్లు అవమానించే సంస్కృతిని తెచ్చారు" అని అన్నారు. ప్రభుత్వాలు శాశ్వతం కాదని చంద్రబాబు గుర్తుంచుకోవాలని జగన్ హెచ్చరించారు. "ఈరోజు మీరు ఏ తప్పుడు విత్తనాలు నాటుతున్నారో, అవే రేపు మహావృక్షాలై మిమ్మల్ని రెండింతలుగా చుట్టుకుంటాయి. ఈ కక్ష సాధింపు రాజకీయాలు మానుకోకపోతే తీవ్ర పరిణామాలు తప్పవు" అని జగన్ హెచ్చరించారు. సమయం వేగంగా గడిచిపోతుందని, ఈ దుర్మార్గపు పాలనకు ప్రజలు త్వరలోనే చరమగీతం పాడతారని ఆయన వ్యాఖ్యానించారు. "ఈ వెన్నుపోటు పార్టీ పాలనలో బాధితులే నిందితులుగా మారుతున్నారు. దాడికి గురైన వారిపైనే కేసులు పెడుతున్నారు. ప్రభుత్వాన్ని ప్రశ్నించిన వారిని అక్రమంగా అరెస్టు చేస్తున్నారు. దీనికి విరూపాక్షి ఉదంతమే ప్రబల ఉదాహరణ" అని జగన్ పేర్కొన్నారు. ఆగస్టు 1న చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో తమ పార్టీ కార్యకర్త గిరి తనపై దాడి జరుగుతోందని, రక్షించమని రాత్రి 7:45 గంటలకు ఎమ్మెల్యే విరూపాక్షికి ఫోన్ చేసి, వీడియోలు పంపాడని జగన్ ఆధారాలను చూపుతూ వివరించారు. వెంటనే ఎమ్మెల్యే స్థానిక ఎస్పైకి 7:47 గంటలకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చినా పోలీసులు స్పందించలేదన్నారు. పైగా, కార్యకర్తను కాపాడటానికి వెళ్లిన ఎమ్మెల్యేపై దాడి చేశారని, ఆయన తమ్ముడి చేయి విరగ్గొట్టారని ఆరోపించారు. దాడికి గురైన విరూపాక్షి ఫిర్యాదును పోలీసులు తీసుకోకపోగా, అర్ధరాత్రి 2:45 గంటలకు వందల మంది పోలీసులు దొంగల్లా ఆయన ఇంటిపై పడి, తలుపులు, సీసీ కెమెరాలు ధ్వంసం చేసి, ఒక ఉగ్రవాదిని పట్టుకున్నట్లు అరెస్టు చేశారని జగన్ మండిపడ్డారు. గంటల వ్యవధిలోనే ఎమ్మెల్యేపై, ఆయన కుటుంబ సభ్యులు, బంధువులు కలిపి మొత్తం 38 మందిపై మూడు వేర్వేరు అక్రమ కేసులు బనాయించి జైల్లో పెట్టారని తెలిపారు. ఒకే వ్యక్తి పేరును ఎఫ్ఐఆర్‌లో రెండుసార్లు చేర్చడం చూస్తే, కేసు ఎంత కట్టుకథో అర్థమవుతోందన్నారు. ఈ ప్రభుత్వం బీసీ, మైనారిటీ వర్గాల నాయకత్వాన్ని అణిచివేసేందుకు కుట్ర చేస్తోందని జగన్ ఆరోపించారు. మాజీ మంత్రి అప్పలరాజు కుమారుడి బైక్ యాక్సిడెంట్‌ను హత్యాయత్నంగా చిత్రీకరించడం, మాజీ ఎమ్మెల్యే ముస్తఫాపై కిడ్నాప్ కేసు పెట్టడం, కారుమూరు సునీల్‌పై అక్రమ కేసులు బనాయించడం వంటివి ఇందులో భాగమేనని విమర్శించారు.

## సీడ్ యాక్సెస్ రోడ్డు.. నూతన స్టీల్ బ్రిడ్జిని ప్రారంభించిన చంద్రబాబు

మొదటిపేజీ తరువాయి – అనుసంధానిస్తూ బకింగ్‌హామ్ కెనాల్‌పై నిర్మించిన నూతన స్టీల్ బ్రిడ్జిని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారికంగా ప్రారంభించారు. ఉండవల్లి వద్ద ప్రత్యేక శిలాఫలకాన్ని ఆవిష్కరించిన సీఎం, అనంతరం స్వయంగా కాలినడకన వెళ్లి స్టీల్ బ్రిడ్జి నిర్మాణాలు, రహదారి సౌకర్యాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భారీ బహిరంగ సభలో రైతులు, స్థానికులను ఉద్దేశించి ఆయన అత్యంత భావోద్వేగంగా ప్రసంగించారు. రాజధాని అమరావతి నిర్మాణం కోసం భూములిచ్చిన అన్నదాతలు చేసింది కేవలం భూత్యాగం మాత్రమే కాదని, రాబోయే తరాలకు, ప్రపంచానికే ఆలోచింపజేసే ఒక గొప్ప స్ఫూర్తినిచ్చారని సీఎం చంద్రబాబు కొనియాడారు. రాజధాని నిర్మాణంలో రైతులను నేరుగా భాగస్వాములను చేయాలనే మహోన్నత ఆలోచనతోనే తాము ల్యాండ్ పూలింగ్ విధానాన్ని తీసుకొచ్చామని ఆయన గుర్తుచేశారు. ప్రభుత్వంపై ఉంచిన నమ్మకంతో నోటిఫికేషన్ ఇచ్చిన కేవలం 58 రోజుల్లోనే 29 వేల మంది రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 33 వేల ఎకరాల భూమిని ఇచ్చారని, ప్రపంచంలో ఎక్కడా ఇలాంటి ఉదారత చూడలేమని చెబుతూ అమరావతి రైతాంగానికి శిరస్సు వంచి పాదాభివందనం చేస్తున్నానని వ్యాఖ్యానించారు. ఉమ్మడి రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ ఎదుర్కొన్న క్లిష్ట పరిస్థితులను స్మరించుకుంటూ, నాడు మనకు రాజధాని ఎక్కడ నిర్మించాలో, ఎటు వెళ్లాలో తెలియని గందరగోళం నెలకొందని తెలిపారు. శివరామకృష్ణన్ కమిటీ నివేదికలు, మెజారిటీ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రాష్ట్రానికి నడిబొడ్డున ఉన్న అమరావతిని రాజధానిగా ఎంపిక చేశామని చెప్పారు. నాడు ఏమీ లేని శూన్యం నుంచి నేడు ప్రపంచం గర్వించే రీతిలో స్వయంగా రాజధానిని నిర్మించుకునే స్థాయికి చేరుకున్నామని ఆనందం వ్యక్తం చేశారు. హైదరాబాద్ అభివృద్ధిని ప్రస్తావిస్తూ... నాడు ఉమ్మడి రాష్ట్రంలో సైబరాబాద్, హైటెక్ సిటీ నిర్మిస్తుంటే చాలామంది హేళనగా మాట్లాడి ఎగతాళి చేశారని సీఎం గుర్తుచేశారు. కానీ నేడు తెలంగాణ తలసరి ఆదాయంలో దేశానికే ఆదర్శంగా నిలిచిందంటే ఒక నాయకుడిగా తనకు ఎంతో గర్వంగా ఉందన్నారు. నాడు చేసిన అభివృద్ధి వల్ల అక్కడ 42 శాతం మంది ప్రజలు బాగుపడ్డారని, మిగిలిన 58 శాతం ఉన్న మన ఆంధ్రప్రదేశ్ ప్రజలకు కూడా ఒక సమర్థవంతమైన, ప్రపంచస్థాయి రాజధాని కావాలనే దృఢ సంకల్పంతోనే అమరావతికి శ్రీకారం చుట్టానని స్పష్టం చేశారు. సైబరాబాద్ నిర్మాణం కోసం తాను అమెరికా వెళ్తే, అమరావతి ప్రపంచంలోనే అత్యుత్తమ నగరం కావాలని తొలిసారి సింగపూర్ వెళ్లానని చెప్పారు. ఈ నగరంలో కేబుళ్లు ఏవీ పైన కనిపించవని, పూర్తి పర్యావరణహితంగా ప్రపంచంలోనే నంబర్ వన్ గ్రీన్ సిటీగా అమరావతి నిలవబోతోందని ధీమా వ్యక్తం చేశారు. గతంలో అమరావతిని కేవలం 'గ్రాఫిక్స్' అని విమర్శించిన వారు ఇప్పుడు ప్రత్యక్షంగా వచ్చి చూస్తే ఇక్కడ జరుగుతున్న అభివృద్ధి ఏంటో కళ్లకు కట్టినట్లు తెలుస్తుందని సూచించారు. ఈ మహోన్నత కార్యక్రమంలో మంత్రులు పి. నారాయణ, నాదెండ్ల మనోహర్, ఎమ్మెల్యేలు తెనాలి శ్రావణ్ కుమార్, కొలికపూడి శ్రీనివాస్, ఎంపీ భాష్యం రామకృష్ణతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, సీఆర్‌డీఏ అధికారులు, వేలాది మంది అమరావతి రైతులు, స్థానికులు పాల్గొన్నారు. అమరావతిలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతం 21.77 కిలోమీటర్ల పొడవైన సీడ్ యాక్సెస్ రోడ్డును ప్రారంభించిన చంద్రబాబు బకింగ్‌హామ్ కెనాల్‌పై 4 వరుసల స్టీల్ బ్రిడ్జిని ప్రారంభించిన సీఎం ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి నిర్మాణంలో మరో కీలక ఘట్టం ఆవిష్కృతమైంది. అమరావతి రవాణా వ్యవస్థకు వెన్నెముకగా నిలిచే ఈ–3 సీడ్ యాక్సెస్ రోడ్ రెండో దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రారంభించారు. రాజధాని కనెక్టివిటీని బలోపేతం చేసే లక్ష్యంతో మొత్తం రూ.1,519 కోట్ల భారీ వ్యయంతో 21.77 కిలోమీటర్ల పొడవున, 60 మీటర్ల వెడల్పుతో 9 లేన్ల రహదారిగా దీనిని రూపొందిస్తున్నారు. విజయవాడ–మంగళగిరి హైవేను అనుసంధానిస్తూ బకింగ్‌హామ్ కెనాల్‌పై 478 మీటర్ల పొడవునా నూతనంగా నిర్మించిన 4 వరుసల స్టీల్ బ్రిడ్జిని కూడా సీఎం ప్రారంభించారు. ఇది రాజధాని ప్రాంతానికి రాకపోకలను మరింత సులభతరం చేయనుంది. సీడ్ యాక్సెస్ రోడ్డుకు సమీపంలో అధికారులు, ఉద్యోగుల కోసం నిర్మించిన 9 టవర్లలోని 216 క్వార్టర్ల పనులన్నీ (ఇంటీరియర్స్ సహా) పూర్తయ్యాయి. అధికారులు వీటికి సంబంధించిన తాళాలను సీఎం చంద్రబాబు నాయుడికి అందజేయనున్నారు.


## గతంలో కోర్టుకెళ్లిన మీరే.. ఇప్పుడు అవే భూములను ఎలా వేలం వేస్తారు?

మొదటిపేజీ తరువాయి – ఈ మేరకు ఆయన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి నేడు ఓ లేఖ రాశారు. ఆగస్టు 17, 21 తేదీల్లో తెలంగాణ పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ (టీజీఐఐసీ) నిర్వహించ తలపెట్టిన వేలాన్ని తీవ్రంగా ఖండించారు. గతంలో ప్రభుత్వ భూములను పూర్వీకులు అందించిన జాతీయ సంపదగా అభివర్ణిస్తూ ఉద్వేగభరిత ప్రసంగాలు చేసిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు ముఖ్యమంత్రి అయ్యాక అవే భూములను అమ్మకానికి పెట్టారంటూ హరీశ్ రావు వ్యాఖ్యానించారు. గచ్చిబౌలి, లగచర్ల, మౌలానా ఆజాద్ జాతీయ ఉర్దూ యూనివర్సిటీ పరిసరాలు, రాయదుర్గం వంటి ప్రాంతాల్లో ప్రభుత్వ భూములను అమ్మేయడానికి కుట్రలు జరుగుతున్నాయని ఆయన ఆరోపించారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ పర్యావరణ భూముల నుంచి రాయదుర్గంలోని వారసత్వ రాతి ప్రదేశాల వరకు తెలంగాణ విలువైన ప్రజా ఆస్తులకు ప్రమాదం వాటిల్లుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. "వేలం వేయాలని ప్రతిపాదించిన రాయదుర్గం పాన్‌మక్తా గ్రామంలోని సర్వే నంబర్ 83ని ఇప్పటికే హెరిటేజ్ సైట్‌గా ప్రకటించారు. దీని యాజమాన్య హక్కులపై ఎస్బీఐ, వక్ఫ్ బోర్డు మధ్య న్యాయవివాదాలు కొనసాగుతున్నాయి. ఇలాంటి కేసులు పరిష్కారం కానప్పుడు థర్డ్ పార్టీ ప్రయోజనాలు కల్పించవద్దని సుప్రీంకోర్టు కూడా స్పష్టం చేసింది" అని హరీశ్ రావు తన లేఖలో గుర్తుచేశారు. ఇదే భూముల పరిరక్షణ కోసం 2020లో రేవంత్ రెడ్డి కోర్టులను ఆశ్రయించారని చెప్పారు. "అప్పుడు కోర్టుకెక్కిన మీరే, ఇప్పుడు సీఎం అయ్యాక వివాదాస్పద ఆస్తిపై థర్డ్ పార్టీ హక్కులు ఎలా కల్పిస్తారు?" అని ప్రశ్నించారు. ఇదే సర్వే నంబర్‌లో గతంలో 6.2 ఎకరాలను ఎకరాకు రూ. 237 కోట్ల చొప్పున వేలం వేయగా, ఆ భూమిపై ఎస్బీఐ యాజమాన్య హక్కులను ప్రకటించిందని, ఈ అంశం ప్రస్తుతం తెలంగాణ హైకోర్టులో విచారణలో ఉందని హరీశ్ రావు తెలిపారు. ఈ కేసు తేలకుండానే, అదే సర్వే నంబర్‌లోని మరో 10.63 ఎకరాలను వేలం వేయడం పరిపాలనా విచక్షణను, ప్రభుత్వ నిబద్ధతను ప్రశ్నిస్తోందని విమర్శించారు. భూమి యాజమాన్య హక్కులు చట్టబద్ధంగా తేలే వరకు ఎలాంటి వేలం, బదిలీ, రిజిస్ట్రేషన్ లేదా అభివృద్ధి కార్యకలాపాలు చేపట్టవద్దని ఆయన డిమాండ్ చేశారు. వారసత్వ ఆస్తికి సంబంధించిన రికార్డుల గల్లంతుపై విచారణ జరిపించాలని, వక్ఫ్ రికార్డుల మాయంపై స్వతంత్ర దర్యాప్తునకు ఆదేశించాలని కోరారు. భవిష్యత్ తరాల కోసం ఈ విలువైన భూములను కాపాడాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని హరీశ్ రావు స్పష్టం చేశారు.

## 250 రోజులుగా సముద్రంలోనే అమెరికా యుద్ధనౌకలో ఏం జరుగుతోంది?

మొదటిపేజీ తరువాయి – పాల్పడినట్లు కుటుంబ సభ్యులు వెల్లడించారు. కొందరు నౌక నుంచి సముద్రంలోకి దూకేందుకు ప్రయత్నించగా తోటి సిబ్బంది అడ్డుకున్నట్లు 'మిలిటరీ టైమ్స్' కథనం తెలిపింది. సుమారు 5,000 మంది నావికులు, మెరైన్లు ఉన్న ఈ యుద్ధనౌక వరుసగా 250 రోజులుగా తీరానికి చేరలేదు. సుదీర్ఘ మోహరింపు, పదేపదే పొడిగింపులు సిబ్బందిపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని కుటుంబ సభ్యులు చెబుతున్నారు. శాన్ డియాగోలో నిర్వహించిన సమావేశంలో దాదాపు 200 మంది కుటుంబ సభ్యులు నేవీ ఉన్నతాధికారులను నిలదీశారు. ఓ మహిళ తన భర్త అదే రోజు తనకు సందేశం పంపాడని చెప్పారు. "రేపు నిద్ర లేవకపోతే బాగుంటుందని" అతడు చెప్పినట్లు తెలిపారు. నేవీ నాయకత్వంపై తమ నమ్మకం దెబ్బతిన్నదని పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. తన భర్త నౌక నుంచి దూకేందుకు ప్రయత్నించాడని మరో నావికుడి భార్య తెలిపింది. సుదీర్ఘ మోహరింపుతో తీవ్రంగా అలసిపోయిన అతడు భవిష్యత్తుపై భయపడుతున్నట్లు చెప్పారు. మరో ఘటనలో నౌక నుంచి దూకేందుకు ప్రయత్నించిన సహచరుడిని ఓ నావికుడు పట్టుకుని వెనక్కి లాగినట్లు సమాచారం. అబ్రహం లింకన్ గత నవంబర్ 21న శాన్ డియాగో నుంచి బయలుదేరింది. తొలుత పసిఫిక్ ప్రాంతానికి వెళ్లాల్సి ఉండగా ఇరాన్ యుద్ధం నేపథ్యంలో మధ్యప్రాచ్యానికి మళ్లించారు. అప్పటి నుంచి సిబ్బందికి తీరంలో గడిపే అవకాశం చాలా తక్కువగా లభించింది. డిసెంబరులో గువామ్‌లో, జులైలో ఒమన్‌లో కలిపి రెండు రోజులు మాత్రమే నేలపై గడిపినట్లు సమాచారం. మే నెలలో మోహరింపు ముగియాల్సి ఉంది. యుద్ధం కొనసాగడంతో పలుమార్లు పొడిగించారు. ప్రస్తుతం నౌక ఇరాన్‌పై యుద్ధ కార్యకలాపాల్లో పాల్గొంటోంది. సిబ్బంది నివాస పరిస్థితులపైనా తీవ్ర ఆరోపణలు ఉన్నాయి. బూజు పట్టిన షవర్లు, పనిచేయని మరుగుదొడ్లు, వారాల తరబడి పనిచేయని లాండ్రీ యంత్రాలు, వేడి నీటి కొరత ఉన్నట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. సబ్బు, డియోడరెంట్, టూత్‌పేస్ట్ కూడా అందుబాటులో లేని సందర్భాలు ఉన్నాయని ఆరోపించారు. ఆహారం పరిమితంగా ఉంటోందని కూడా ఫిర్యాదులు వచ్చాయి. కాలిఫోర్నియా కాంగ్రెస్ సభ్యుడు మైక్ లెవిన్ ఈ పరిస్థితులపై ఆందోళన వ్యక్తం చేశారు. సైనికులకు కనీసం వేడి నీరు, పనిచేసే మరుగుదొడ్డి, తగిన ఆహారం అందించాల్సిన బాధ్యత నేవీపై ఉందని అన్నారు.

## ఇమ్రాన్ ఖాన్ చనిపోయారా? పాక్ జర్నలిస్టు సంచలన వ్యాఖ్యలు.. నిజమెంత?



మొదటిపేజీ తరువాయి – అమెరికాలో ఉంటున్న జర్నలిస్ట్ వజాహత్ సయీద్ ఖాన్ ఓ ఇంటర్వ్యూలో సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇమ్రాన్ ఖాన్ ఇప్పుడు జీవించి లేరని ముగ్గురు సీనియర్ పాకిస్థాన్ సైనిక అధికారులు తనకు చెప్పినట్లు ఆయన పేర్కొన్నారు. అయితే వాళ్లు కూడా ఈ సమాచారాన్ని స్వయంగా నిర్ధారించలేదని చెప్పారు. అనధికారిక మార్గాల్లో తమకు సమాచారం అందిందని మాత్రమే వారు చెప్పినట్లు వివరించారు. 73 ఏళ్ల ఇమ్రాన్ ఖాన్ 2023 నుంచి రావల్పిండిలోని అడియాలా జైలులో ఉన్నారు. ఆయనపై పలు కేసులు కొనసాగుతున్నాయి. జైల్లో ఉన్న ఆయన్ను కలిసేందుకు కుటుంబ సభ్యులకు అనుమతి ఇవ్వడం లేదంటూ పాకిస్థాన్ తెహ్రీక్–ఏ–ఇన్సాఫ్ (పీటీఐ) పార్టీ పలుసార్లు ఆరోపించింది. ఆయనకు సరైన వైద్యం అందడం లేదని కూడా పార్టీ నేతలు చెబుతున్నారు. ఇమ్రాన్ కుటుంబ సభ్యులు, పీటీఐ నేతలు మంగళవారం మరోసారి ఆందోళన వ్యక్తం చేశారు. ఆయన ఆరోగ్య పరిస్థితిపై స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఇమ్రాన్‌ను కలిసేందుకు అనుమతి ఇవ్వకపోతే సెప్టెంబర్ 27న ఇస్లామాబాద్‌కు లాంగ్ మార్చ్ చేపడతామని పీటీఐ ప్రకటించింది. అంతకుముందే నిరసనలు చేపడతామని హెచ్చరించింది. ఇమ్రాన్ ఖాన్ ఆరోగ్య పరిస్థితిపై అమెరికా నుంచి కూడా పాకిస్థాన్‌పై ఒత్తిడి పెరుగుతోంది. 13 మంది అమెరికా చట్టసభ సభ్యులు అక్కడి విదేశాంగ మంత్రి మార్కో రూబియోకు లేఖ రాశారు. ఇమ్రాన్, ఆయన భార్య బుష్రా బీబీ నిర్బంధ పరిస్థితులపై ఇస్లామాబాద్‌తో మాట్లాడాలని కోరారు.

## సభలో తొలిసారి వందేమాతరం ఆరు చరణాల ఆలాపన.. ముగిసిన వర్షాకాల సమావేశాలు



ఈ సమావేశానికి ప్రధాని మోదీ, ప్రతిపక్ష నేత రాహుల్‌తోపాటు సభ్యులంతా హాజరయ్యారు. జాతీయ గేయంలోని ఆరు చరణాలను పూర్తిగా ఆలపించిన అనంతరం సభను నిరవధికంగా వాయిదా వేశారు. దీంతో వర్షాకాల సమావేశాలు ముగిసినట్లు అయింది. వందేమాతరం గేయాన్ని చట్టపరంగా రక్షణ కల్పించే శాసనానికి రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆమోద ముద్ర వేసిన కొన్ని రోజులకే లోక్‌సభలో ఈ పరిణామం చోటు చేసుకుంది. జాతీయ గేయాన్ని ఆలపించడాన్ని ఉద్దేశపూర్వకంగా అడ్డుకోవడం లేదా నిరోధించడం శిక్షార్హమైన నేరమని ఈ చట్టం స్పష్టం చేస్తోంది. తద్వారా దీనికి జాతీయ గీతం 'జనగణమన'తో సమానమైన చట్టపరమైన హోదా లభించినట్లైంది. రాష్ట్రపతి రాక, త్రివర్ణ పతాకావిష్కరణ, గవర్నర్ల ప్రసంగం వంటి సందర్భాల్లో వందేమాతరంలోని ఆరు చరణాలను ఆలపించాలని జనవరి 28వ తేదీన కేంద్ర హోం మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జులై 20వ తేదీన ప్రారంభమై.. ఆగస్టు 13వ తేదీతో ముగిశాయి. నీట్ పేపర్ లీక్‌కు బాధ్యత వహిస్తూ కేంద్రం విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామాతోపాటు విద్యావ్యవస్థలో సంస్కరణలను డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) ఆందోళన చేపట్టింది. జులై 20వ తేదీన వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన నేపథ్యంలో ఆ రోజు చలో పార్లమెంట్ యాత్రకు సీజేపీ పిలుపునిచ్చింది. ఈ ఘటనతో చోటు చేసుకున్న తీవ్ర పరిణామాలతో మంత్రి పదవికి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేశారు. అదే విధంగా పార్లమెంట్ సమావేశాల్లో యాంటీ పేపర్ లీక్ బిల్లుతోపాటు పలు బిల్లులు ఆమోదం పొందాయి. అయితే.. ఢిల్లీలో యువతపై జరిగిన లాఠీఛార్జ్‌కు ఎవరు ఆదేశాలు ఇచ్చారో సభలో ప్రకటన చేయాలంటూ కేంద్రాన్ని ప్రతిపక్షం కాంగ్రెస్ డిమాండ్ చేసింది. ఈ నేపథ్యంలో సభలో దాదాపుగా వాయిదాల పర్వం కొనసాగింది. చివరకు ఈ రోజు ఉభయ సభలు నిరవధికంగా వాయిదా పడ్డాయి.

# ప్రతి కుటుంబానికి సంక్షేమం ప్రతి గ్రామానికి అభివృద్ధే టీడీపీ ధ్యేయం

### ఎద్దులదొడ్డిలో 'ఇంటింటికీ తెలుగుదేశం'..

### ఘనంగా జాతీయ జెండా ఆవిష్కరణ





**తుగ్గలి, ఆగస్టు 13 ( ప్రభమనం న్యూస్):** తుగ్గలి మండల పరిధిలోని ఎద్దులదొడ్డి గ్రామంలో 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు ఉత్సాహంగా నిర్వహించారు. మాజీ జడ్పీ చైర్మన్ బత్తిన వెంకటరాముడు, వ్యవసాయ సొసైటీ చైర్మన్ అప్పా వేణుగోపాల్, టీడీపీ మండల అధ్యక్షుడు తిరుపాల్ నాయుడు ఆధ్వర్యంలో నాయకులు ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలుసుకుని ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు అందేలా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని నాయకులు తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం, గ్రామీణాభివృద్ధికి పెద్దపీట వేస్తోందన్నారు. తల్లికి వందనం, ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, అన్న క్యాంటీన్లు, అన్నదాత సుఖీభవ, దీపం పథకం వంటి కార్యక్రమాలతో ప్రజలకు మేలు జరుగుతోందని పేర్కొన్నారు. అనంతరం స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ఎద్దులదొడ్డి గ్రామంలో టీడీపీ నాయకులు జాతీయ జెండాను ఆవిష్కరించారు. 'భారత్ మాతాకీ జై' నినాదాలతో గ్రామంలో దేశభక్తి నినాదాలు మార్మోగాయి. జాతీయ జెండాకు వందనం చేసి దేశ సమైక్యత, సమగ్రతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని వాటి పరిష్కారానికి కృషి చేయడమే 'ఇంటింటికీ తెలుగుదేశం' కార్యక్రమం లక్ష్యమని నాయకులు తెలిపారు. గ్రామాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయడంతో పాటు అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఎద్దులదొడ్డి శ్రీనివాసులు, అప్పా వేణుగోపాల్, తిమ్మయ్య చౌదరి, వల్లే,వెంకటే , బెస్త కిట్టయ్య,సంఘాల కృష్ణ, ఎడవల్లి తిమ్మప్ప, అమీనాబాద్ మధుబాబు, చంద్రశేఖర్, గిరి గట్ల బలరామ్ సుభాష్ చంద్రబోస్, సర్పంచ్ విజయ్ ,మల్లన్న, ఫీల్డ్ అసిస్టెంట్ రవి తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# భక్తులకు మెరుగైన సేవలు అందించాలి

### మఠం పీఠాధిపతులు సుభుదేంద్ర తీర్థు





**మంత్రాలయం , ఆగస్టు 13,మనం న్యూస్ ;-** భక్తులకు మెరుగైన సేవలు అందించి వారి నుంచి ప్రశంసలు అందుకోవాలని శ్రీ మఠం పీఠాధిపతులు శ్రీ సుభుదేంద్రతీర్థులు సూచించారు. గురువారం హొన్నాళ్ళి బ్రదర్స్ నూతనంగా నిర్మించిన శ్రీ సుజయీంద్ర కంఫర్ట్ వసతి గృహాన్ని వేద మంత్రాలు మధ్య ప్రారంభించారు. అనంతరం దీప ప్రజ్వలనంతో విశేష పూజలు నిర్వహించి మంగళ హారతులు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ రాఘవేంద్రస్వామి మఠం పూర్వపు పీఠాధిపతులు శ్రీ సుజయీంద్ర తీర్థుల కాలంలో శ్రీ మఠం దివాన్ గా హొనళ్ళి వెంకోబాచార్ పనిచేసి సేవలు అందించారని పీఠాధిపతులు తెలిపారు. మాకు కూడా పూర్వాశ్రమంలో బంధువులని వెంకోబా చార్ మా తల్లి తండ్రి గారని, తాతయ్య అవుతారని, హొన్నాళ్ళి బ్రదర్స్ మేనమామలు అవుతారని పేర్కొన్నారు. హొన్నాళ్ళి వెంకోబాచార్ కు హొన్నాళ్ళి ప్రహ్లాదాచార్, గిరిధర్ ఆచార్, వ్యాసరాజాచార్ లు ముగ్గురు కుమారులు కలిసి 14 ఏసి కలిగిన గదులతో నిర్మించిన శ్రీ సుజయీంద్ర కంఫర్ట్ వసతి గృహంలో శుభ్రంతను పాటించి సౌకర్యాలు కల్పించి భక్తుల మన్ననలు పొందాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా హొన్నాళ్ళి వ్యాసరాజాచార్ దంపతులు పీఠాధిపతులకు పాదపూజ చేసి రాఘవేంద్రస్వామి చిత్ర పటాన్ని స్వామిజీ కి అందజేశారు. ఈ కార్యక్రమంలో పీఠాధిపతుల పూర్వాశ్రమ తల్లి గారు శ్రీ మతి మంజులాభాయ్ శ్రీ మఠం ఏఏఓ మాధవ శెట్టి మేనేజర్లు ఎస్కే శ్రీనివాసరావు వెంకటేష్ జ్యోషి ఆధ్యాత్మిక అభివృద్ధి అధికారి శ్రీ పతి ఆచార్ శ్రీ మఠం పిఆర్వో పురాణిక అనంతాచార్, పూజారి వ్యాసరాజస్వామి పూజారి గోపాలకృష్ణాచార్ మాజీ ఉప సర్పంచ్ గోర్కల్ కృష్ణస్వామి శ్రీ మఠం నిర్వహణలో ఉన్న బృందావన గార్డెన్ వసతి గృహ సముదాయం సిఆర్వో గుంజళ్ళి విజయీంద్ర చార్, గుంజళ్ళి గోపినాథ్ ఏపిజిబి మేనేజర్ మంజునాథ్, బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ వెంకట్, సిబ్బంది అరుణ్ కర్ణాటక బ్యాంక్ మేనేజర్ కార్తీక్ ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి

# టీనేజ్ గర్భధారణపై అప్రమత్తత అవసరం

### రక్తహీనత నివారణకు పోషకాహారంతో పాటు

### వైద్యుల సూచనలు పాటించాలి

### ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ జి. అమర్నాథ్



**,తుగ్గలి, ఆగస్టు 13 ( ప్రభ మనం,న్యూస్):** బాల్య వివాహాలు, కౌమార దశలో గర్భధారణతో ఎదురయ్యే ఆరోగ్య సమస్యలపై బాలికలు, తల్లిదండ్రులు పూర్తి స్థాయిలో అవగాహన కలిగి ఉండాలని తుగ్గలి పీహెచ్‌సీ ఆయుర్వేద వైద్యాధికారి డాక్టర్ జి. అమర్నాథ్ సూచించారు. తుగ్గలి మండల కేంద్రంలోని కేజీబీవీ పాఠశాలలో గురువారం బాల్య వివాహాలు, టీనేజ్ గర్భధారణ, రక్తహీనతపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అమర్నాథ్ మాట్లాడుతూ బాల్య వివాహాలు బాలికల భవిష్యత్తుతో పాటు వారి శారీరక, మానసిక ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతాయని తెలిపారు. చిన్న వయసులోనే వివాహం, గర్భధారణ కారణంగా తల్లికి, శిశువుకు అనేక ఆరోగ్య సమస్యలు ఎదురయ్యే ప్రమాదం ఉందన్నారు. బాలికల చదువును కొనసాగిస్తూ, వారికి సరైన ఆరోగ్య అవగాహన కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. కౌమార దశలో శరీరంలో చోటుచేసుకునే మార్పులపై బాలికలకు సరైన అవగాహన ఉండాలని, ఆరోగ్యానికి సంబంధించిన సమస్యలను దాచిపెట్టకుండా వైద్యులను సంప్రదించాలని సూచించారు. బాల్య వివాహాలను నిరోధించేందుకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ఆరోగ్య సిబ్బంది, గ్రామస్థులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

**రక్తహీనతపై ప్రత్యేక అవగాహన**

గర్భిణులు, బాలింతల్లో రక్తహీనత సమస్యను నిర్లక్ష్యం చేయరాదని డాక్టర్ అమర్నాథ్ తెలిపారు. రక్తహీనత నివారణకు ఐరన్, విటమిన్లు, ప్రోటీన్లు సమృద్ధిగా ఉండే పోషకాహారం తీసుకోవడంతో పాటు వైద్యుల సూచనల మేరకు మందులు వినియోగించాలని చెప్పారు. ఆయుర్వేద వైద్య విధానంలో వైద్యుల పర్యవేక్షణలో అందుబాటులో ఉన్న చికిత్సా విధానాలను ఉపయోగించడం ద్వారా రక్తహీనత నియంత్రణకు సహాయపడవచ్చని వివరించారు.

గర్భిణులు, బాలింతలు క్రమం తప్పకుండా ఆరోగ్య పరీక్షలు చేయించుకోవడంతో పాటు వైద్య సిబ్బంది సూచనలను పాటించాలని కోరారు.

కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ రోజారమణి, పీహెచ్ఎన్ సరస్వతి, సూపర్‌వైజర్ నాగమ్మ, హెల్త్ అసిస్టెంట్ రామాంజనేయులు, హెల్త్ సెక్రటరీ పద్మావతి, ఆశా కార్యకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ సద్గురు.. లంబికాయోగి వర లింగమూర్తి స్వాముల వారి 41,వ ఆరాధన...!!

### స్వామివారి చెంతకు భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్న దృశ్యం.....

### గురువు కీర్తనలు వింటే మంచి ఫలితం....












**పెద్దకడుబూరు, ఆగస్టు,13,ప్రభ మనం:** మండల పరిధిలోని జాలవాడి గ్రామంలో వెలసిన శ్రీ,సద్గురు లంబికాయోగి వర లింగమూర్తి స్వాములు,మరియు నాగప్ప స్వామి వారి 41,వ ఆరాధన మహోత్సవం గురువారం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి మఠం పీఠాధిపతులు శ్రీమతి కె, జయలక్ష్మాంబ, లింగప్ప స్వామి వారి ఆధ్వర్యంలో స్వామివారి సన్నిధిలో ఉదయం 6,గంటలకు గణపతి పూజ,కలశ పూజ తదనంతరం కంబలదిన్నే గ్రామం కురువ,చిన్న లింగప్ప స్వగృహం నుండి శ్రీ,సద్గురు లంబికాయోగి వర లింగమూర్తి స్వాముల వారి చిత్ర పటంను భక్తులు అశేష జనవాహిని మధ్య భారీగా డప్పు వాయిద్యాలతో మేళతాళాలతో ఊరేగింపు చేసుకొని జాలవాడి లో వెలసిన మఠం కు చేరుకున్నారు.. అలాగే స్వామి వారి సన్నిధికి పెద్ద ఎత్తున భక్తులు చేరుకొని స్వామి అనుగ్రహం పొందారు.భక్తులకు ఉదయం 11,గంటల నుండి రాత్రి 12,గంటల వరకు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. మరియు రాత్రి 10,గంటల నుండి ఉపన్యాసాలు,భజన కీర్తనలు గావించారు..ఈ కార్యక్రమంలో భక్తులు,శిష్యాధులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

# హర్ ఘర్ తిరంగ్ పై విద్యార్థులతో సైకిల్ ర్యాలీ



**మంత్రాలయం ,ఆగస్టు 13,మనం న్యూస్ ;-** హర్ ఘర్ తిరంగ్ పై తహసీల్దార్ కె. రమాదేవి ఎస్ఐ మల్లికార్జున ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి సైకిల్ ర్యాలీ నిర్వహించారు. గురువారం స్థానిక రాఘవేంద్ర సర్కిల్ మీదుగా అవగాహన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు హర్ ఘర్ తిరంగ్ కార్యక్రమంలో భాగంగా ప్రతి ఒక్కరూ తమ ఇంటి పై జాతీయ పతాకాన్ని ఎగురవేయాలని సూచించారు. దేశ పౌరులుగా జండాలను ఎగురు వేసి దేశ భక్తిని చాటుకోవాలని పేర్కొన్నారు. ప్రతి శాఖ లోని ప్రతి ఉద్యోగి తమ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని, అదే మనం ప్రజలకు మనం చేసే సేవగా భావించాలన్నారు. ఎన్ని ఒత్తిడులు ఉన్న ప్రతి ఒక్కరినీ గౌరవించినపుడే తగిన గుర్తింపు వస్తుందని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో , డిప్యూటీ ఎంపీడీవో ఉపేందర్ రెడ్డి హెడ్ కానిస్టేబుల్ మురళీ ధర్ రెడ్డి ఇతర అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

# వాల్మీకుల ఎస్టీ రిజర్వేషన్ కోసం ప్యాపిలి హైవే దిగ్బంధం

### బీవీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు తలారి వాల్మీకి అంజి పిలుపు



**తుగ్గలి ఆగస్టు 13 ( ప్రభ మనం,న్యూస్):** ఆంధ్రప్రదేశ్‌లో వాల్మీకులకు ప్రాంతీయ వ్యత్యాసాలు తొలగించి రాష్ట్రవ్యాప్తంగా ఎస్టీ రిజర్వేషన్ అమలు చేయాలని కోరుతూ ఎంవీఆర్‌పీఎస్ ఆధ్వర్యంలో ఆగస్టు 14న నిర్వహించనున్న ప్యాపిలి హైవే దిగ్బంధం కార్యక్రమానికి భారతీయ వాల్మీకి సంఘం (బీవీఎస్) సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ కార్యక్రమాన్ని పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని బీవీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు తలారి వాల్మీకి అంజి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒకే రాష్ట్రంలో వాల్మీకులకు ప్రాంతాల వారీగా వేర్వేరు రిజర్వేషన్లు అమలు చేయడం సరికాదన్నారు. శ్రీకాకుళం నుంచి ఏలూరు వరకు వాల్మీకులకు ఎస్టీ హోదా ఉండగా, విజయవాడ నుంచి రాయలసీమ జిల్లాల వరకు బీసీ జాబితాలో ఉండటంతో విద్య, ఉద్యోగ అవకాశాల్లో అన్యాయం జరుగుతోందన్నారు. 2014, 2024 ఎన్నికల సమయంలో వాల్మీకుల ప్రాంతీయ వ్యత్యాసాలను తొలగించి రాష్ట్రవ్యాప్తంగా ఎస్టీ రిజర్వేషన్ అమలు చేస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ప్రభుత్వం ఏర్పడి రెండేళ్లు కావస్తున్నా సమస్య పరిష్కారం కాకపోవడంతో ఉద్యమ కార్యాచరణ చేపట్టాల్సి వచ్చిందన్నారు. వాల్మీకి సోదరులు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్యాపిలి హైవే దిగ్బంధం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని అంజి కోరారు.

# రాఘవుడి ఆరాధనోత్సవాల కు రావాలని కర్ణాటక రాష్ట్ర మంత్రులకు ఆహ్వానం





**మంత్రాలయం ఆగస్టు 13,మనం న్యూస్ :** రాఘవేంద్ర స్వామి 355వ ఆరాధన ఉత్సవాల్లో భాగంగా పీఠాధిపతి సుభుధేంద్ర తీర్థల ఆధ్వర్యంలో ఈ నెల 27 నుంచి సెప్టెంబర్ 2 వరకు జరిగే సప్తరాత్రోత్సవాలకు హాజరు కావాలని కోరుతు పీఠాధిపతి ఆదేశానుసారం శ్రీ మఠం అసిస్టెంట్ మేనేజర్/ పీఆర్వో ఐపీ నరసింహ మూర్తి స్వామి శ్రీష జోషి ఀ కిరణ్ లు బెంగళూరు లోని కర్ణాటక డిప్యూటీ సీఎం మరియు రెవెన్యూ శాఖ మంత్రి జి. పరమేశ్వర, ఆరోగ్య శాఖ మంత్రి యూ. టీ. ఖాదర్ లకు వేర్వేరు సమయాల్లో ఆహ్వాన పత్రికలను అందజేశారు.

# మట్టిని మట్టుపెడుతున్న మందు



పుడమి గర్భంలోని జీవాన్ని హరిస్తున్నది కలుపు కాదు, కలుపును చంపేందుకు మానవులు చేస్తున్న చర్యలే. దానికి మూలకారణం గ్లైఫోసేట్' అనే నాన్–సెలెక్టివ్ హెర్బిసైడ్. ఇది వాడిన భూమిలో జీవమనేదే మిగలదు. ఈ రసాయనం పడిన చోట మట్టి శ్వాస కూడా తీసుకోలేదు. పంటల మీద పడితే మాడిపోతాయి. ఆ మందు వాడిన గడ్డిని తినే మూగజీవాలు సైతం చనిపోతాయి. రైతులు తీవ్ర అనారోగ్యాల బారినపడతారు. భూమిలో జీవానికి, భూమిపై మానవాళికి పెనుముప్పుగా మారిన ఈ గడ్డి మందును చాలా దేశాలు నిషేధించాయి. కానీ, మన దేశంలో మాత్రం యథేచ్ఛగా క్రయవిక్రయాలు జరుగుతుండటం శోచనీయం. అమెరికాలోని ఒక ప్రముఖ కంపెనీ 1970లో మొదటిసారిగా గ్లైఫోసేట్‌ను మార్కెట్లోకి తీసుకొచ్చింది. ఇది మొక్కల్లోని ఒక ముఖ్యమైన ఎంజైమ్‌ను నిరోధించి, మొక్కల ఎదుగుదలను అడ్డగిస్తుంది. దీన్ని ప్రధానంగా కలుపు నివారణ కోసం వాడుతున్నప్పటికీ, ఇది పంటలు, మట్టిలోని ఇతర జీవులపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుంది. కూలీల ఖర్చులను తగ్గించేందుకు రైతులు గ్లైఫోసేట్‌ను విస్తృతంగా వాడుతున్నారు. కలుపును నివారిస్తున్నట్టు అన్నదాతలు భావిస్తున్నారు. కానీ, దీర్ఘకాలంలో భూసారం తగ్గిపోయి దిగుబడి పడిపోతుంది. అంతేకాదు, కర్షకులు కూడా రోగాల బారినపడి అనవసర ఖర్చుల భారం మోయాల్సి వస్తుంది. గ్లైఫోసేట్ పిచికారి మూలంగా నెలకు సగటున 12 మంది రైతులు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నట్టు 2023లో కేంద్ర ఆరోగ్య మంత్రిత్వ శాఖ నిర్వహించిన ఒక అధ్యయనంలో తేలింది. ఎయిమ్స్ నివేదిక ప్రకారం.. గ్లైఫోసేట్ వ్యాప్తి ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో గర్భస్థ శిశువుల వృద్ధిలో లోపాలు 18 శాతం వరకు పెరిగాయి. గ్లైఫోసేట్ వల్ల మట్టిలోని ఫంగై, బ్యాక్టీరియా వంటి సూక్ష్మజీవులు నశించి హ్యూమస్ ఉత్పత్తి నిలిచిపోతుంది. ఇది కార్బన్ నిల్వల తగ్గుదలకు దారితీసి, గ్రీన్‌హౌస్ వాయువుల ఉద్గారాన్ని పెంచుతుంది. తద్వారా వాతావరణ మార్పులకు ఇది పరోక్షంగా కారకమవుతుంది. దీని వాడకం గణనీయంగా పెరగడం వల్ల వాతావరణంపై దుష్ప్రభావాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని ఐరాస ఐపీపీసీ–2022 నివేదిక స్పష్టం చేసింది.

జర్మనీ, ఆస్ట్రియా, ఫ్రాన్స్, ఇటలీ, నెదర్లాండ్స్ వంటి దేశాల్లో ఈ రసాయనంపై నిషేధం కొనసాగుతున్నది. 2018లో అమెరికాలోని కాలిఫోర్నియాలో ఈ రసాయనాన్ని ఉత్పత్తి చేస్తున్న కంపెనీపై ఓ రైతు కేసు వేశాడు. దుష్ప్రభావాలు ఉన్నట్టు రుజువు కావడంతో సదరు రైతుకు 289 మిలియన్ డాలర్ల పరిహారం చెల్లించాల్సి వచ్చింది. అమెరికాలో ఈ కంపెనీపై ఇప్పటివరకు ఇలాంటి కేసులు లక్షకు పైగా దాఖలయ్యాయి. ఆహార పదార్థాల్లో గ్లైఫోసేట్ అవశేషాలు ఎక్కువవుతున్నాయని కెనడాలో హెచ్చరికలు జారీ అయ్యాయి. 2022 నవంబర్‌లో కేంద్ర ప్రభుత్వం దీనిపై పాక్షిక నిషేధం విధించింది. కానీ, అది నామమాత్రమే. రసాయన కంపెనీల ప్రలోభాలకు లోనై పలువురు వ్యవసాయ శాస్త్రవేత్తలు దీని వినియోగాన్ని ప్రోత్సహిస్తుండటం విషాదం. ఏపీ, తెలంగాణల్లో గతంలో 60 రోజులపాటు తాత్కాలికంగా నిషేధించారు. కానీ, ప్రస్తుతం ఇది మార్కెట్లలో విచ్చలవిడిగా లభిస్తున్నది. తమకు అధికారం లేకపోయినా కేరళ, సిక్కిం లాంటి రాష్ట్రాలు రాజకీయ సంకల్పంతో శాశ్వత నిషేధాన్ని అమలు చేస్తున్నాయి. కానీ, ఏపీ, తెలంగాణల్లో మాత్రం ఆ సంకల్పం కొరవడింది. ఈ రసాయనాన్ని వినియోగిస్తున్న రైతులు ఆర్థికంగా, శారీరకంగా చితికిపోతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, వ్యవసాయ శాఖ, పరిశోధన సంస్థలు తమ బాధ్యతను మరిచి కార్పొరేట్ కంపెనీల ప్రలోభాలకు తలొగ్గడంతో అన్నదాతల జీవితాలు ఆవిరైపోతున్నాయి. ఇప్పటికైనా గ్లైఫోసేట్‌పై శాశ్వత నిషేధం విధించాలి. జీవ, సేంద్రియ కలుపు నివారణ పద్ధతులను అభివృద్ధి చేయాలి. రైతులకు అవగాహన కల్పించాలి. రైతు శ్వాస ఆగకూడదంటే, మట్టిలో జీవం కొనసాగాలంటే, భవిష్యత్తు పంటల భద్రత కోసం ట్గ్లైఫోసేట్‌కు శాశ్వతంగా చరమగీతం పాడాలి. ఒక్క రైతే కాదు, మట్టి, ఒక తరం, దేశ భవిష్యత్తే ప్రమాదంలో ఉంది. దీన్ని మౌనంగా చూస్తూ ఉంటే మనం కూడా మట్టి గొంతు పిసికినవాళ్లమవుతాం. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు జీవరక్షణ యజ్ఞాన్ని ప్రారంభించాలి.మట్టిని మట్టుపెడుతున్న మందు పుడమి గర్భంలోని జీవాన్ని హరిస్తున్నది కలుపు కాదు, కలుపును చంపేందుకు మానవులు చేస్తున్న చర్యలే. దానికి మూలకారణం గ్లైఫోసేట్' అనే నాన్–సెలెక్టివ్ హెర్బిసైడ్. ఇది వాడిన భూమిలో జీవమనేదే మిగలదు. ఈ రసాయనం పడిన చోట మట్టి శ్వాస కూడా తీసుకోలేదు. పంటల మీద పడితే మాడిపోతాయి. ఆ మందు వాడిన గడ్డిని తినే మూగజీవాలు సైతం చనిపోతాయి.

# మీరిచ్చే పైసలు మిత్తికే సాలయి

‘ఓ అయ్యా జర నీ దయ. మోస్కచ్చేటందుకు నీన్లేనా? బరువున్న బకీట్లు అమాంతం మోస్కరావద్దని నీకెన్నిమాట్ల చెప్పాలె? నేన్ చెప్తనే ఉంటా, నువ్వు చేసేది చేస్తనే ఉంటవ్..’ అని గద్మాయిస్తున్నది గంగవ్వ. పొద్దటిసంది మలెవడి ఉన్న చాయ్ గిలాసలు కడుగాల్నంటే నీళ్లు కావాలె గదా? గిలాసలు కడుగుదామని బోరింగ్ కాడికి వోయి నీళ్ల బకీట్లు మోసుకొస్తున్న. అది జూసిన గంగవ్వ గరం గరమై గాయికెత్తుకుంటున్నది. గంగవ్వ ఉత్తగనే మొత్తుకుంటలేదు, మిషిన్ ఎక్కడ ఆగిపోతదోనని ఆమె బాధ. ఈ మిషిన్ ముచ్చట తర్వాత జెప్త గనీ గంగవ్వ ఎవ్వలో ఎర్కేనా? నేను తాళి గట్టిన ఆలి. జైతాల జిల్లా గొల్లపల్లి మండలం తిర్మలాపూర్ చౌరస్తా మూల మీన ఉంటది మా చాయ్ ఓటల్. మాదిదే ఊరు. ఇద్దరాలుమొగలం గల్సి చాయ్ ఓటల్ వెట్టుకొని తలో సార్గం జేస్కుంటున్నం. అల్కటి పనులు నేన్జేస్తే, గొట్టు పనులు నా గంగవ్వ జేస్తది. మేమిద్దరం, మాకు ముగ్గురు. మాకున్నది ఎకురం భూమి. ఆ భూమిల ఏమంత పండుతయ్? అందుకే ఆ భూమిని గంగవ్వను జూస్కొమ్మని చెప్పి నేను ఖతార్ తొవ్వ వట్టిన. 1992ల అనుకుంట జైతాలల పట్నం బస్సు, పట్నంల గాలిమోటరెక్కి, దూరదేశంల దిగిన. ఒక్కేడా, రెండేండ్లా? ఇరువై ఐదేండ్లు అక్కన్నే పన్జేసిన. మొదట్ల లేబర్ పనికే వోయిన గనీ, కొన్నొద్దుల తర్వాత డ్రైవర్ పని దొరికింది. ఆ తర్వాత కొన్నొద్దులకు క్రేన్ నడిపే పనికి కుదిరిన. ఓ రోజు పనైపోయి ఇంటికివోయినంక నాత్రి ఎడమ జబ్బ గుంజుకొస్తున్నది. ఉత్త నొప్పే గావొచ్చునని ఎక్వ పట్టిచ్చోలె. తెల్లారి డూటికి ఎప్పట్లెక్కనే వోయిన. డూటెక్కి డ్రైవర్ సీటు మీన గూసున్న. గంతే.. కండ్లకు శిమ్మ శీకట్లచ్చి కూసున్న కుర్సీలనే కూలవడ్డ. ‘అరేయ్ పోశమల్లన్నకు ఏమో అయిందిరా.. పట్టుర్రి దావఖానకేస్కవోదాం’ అని అమాంతం లేవట్టిర్రు. వాళ్ల మాటలు నాకినవడ్తున్నయి గనీ, నిల్సోని మాట్లాడే ఓసర లేదు.

కండ్లు దెర్సి జూస్తే తెల్లారి ఖతార్‌లోని ఓ దావఖాన్ల నేను షరీఖై ఉన్న. ‘నాకేమైందని మా ఊరి దోస్తులనడిగితే వాళ్లు శెప్పవట్టిర్రు నాకు ఆటోటాక్ అచ్చిందని. స్టంట్లు గూడ ఏసిర్రట. ‘ఇది మొదటిసారే, ఏం గాదు గనీ, కొంచెం జాగ్రత్తగుండాల’ని డాక్టర్లు శెప్పవట్టిర్రు. అక్కడ జరిగిన ముచ్చట తిర్మలాపూర్‌ల ఉన్న గంగవ్వకెట్ల ఎర్కయిందో ఏమో గని.. జుమ్మ రోజు ఇంటికి పోన్జేస్తే ఒక్కటే మొకాన ఏడ్వవట్టింది. ‘అర్రె నాకేం గాలెదే.. శెక్కరొచ్చి కిందవడ్డ గంతే’ అన్జెప్పినా నమ్మలే. ‘మాకు మొత్తం ఎర్కే గని, నువ్వైతే ముందుగాళ్ల ఇంటికిరా’ అని బతిలాడవట్టింది. ఆమె ఒక్కతే గాదు, బిడ్డ, ఇద్దరు కొడుకులు గూడ అదే మంకుపట్టు వట్టిర్రు. వాళ్ల మాట తీసెయ్యలేక ఇండియాకొచ్చిన. ఎయిర్పోర్టుల ఇమానం దిగి ఇట్ల బైటికచ్చిన్నో లేదో.. మావోళ్లు నా మీదవడి ఒగేడ్సుడు గాదు. వాళ్లేడ్వు జూసి నా కండ్లు గూడ ధైర్నం శెడ్డయి. అసలే గొల్లోళ్లం. ఉంటే గింటే గొర్లమందలుంటయి గని, అయ్యవ్వలు, తాతముత్తాతలు సంపాయించిన ఆస్తిపాస్తులుంటయా? కమ్సెకం మాకా గొర్లు గూడ లెవ్వు. ఎకురం భూమిల ఎంత పండించినా ఎన్కకే గని, ముందుకు వోవుడుంటదా? గందుకే ఓ ఇకమత్ జేసి మా తిర్మలాపూర్ చౌరస్తా మూలమీన చాయ్ ఓటల్ వెట్టినం. పొద్దటిపూట తడట్కులు, ఇడ్లి, వడ, పూరి.. మాపటి పూట చాయ్ అమ్ముకుంటా బతుకు ఎల్లదీస్తున్నం. 2018ల అనుకుంటా%ొ% ఓ రోజు మబ్బుల్నే నేను, గంగవ్వ ఇద్దరం గల్సి ఓటల్ కాడికొచ్చినం. నేను టిఫిన్లు జేస్తున్న, గంగవ్వనేమో అన్లకు సామాన్లు అందిస్తున్నది. ఆ ఆటోటాక్ పాడుగాను మల్లొచ్చి పాడైంది. ఎడమదిక్కు గుంజుకొస్తున్నదని గంగవ్వకు జెప్పంగనే జెల్ది ఆటో మాట్లాడింది. ఆ ఆటో సీద వోయి కన్నారం అపోలో రీచ్ దావఖాన కాడ ఆగింది. నాకు పరీచ్చలు జేసి మల్లోపారి స్టంట్లెయ్యాల్నని శెప్పవట్టిర్రు. ‘పైసలకేడ వోవుడు సార్.. సక్కగ నన్ను సర్కార్ దావఖానకు పంపియ్యిర్రి’ అంటే.. ‘ఎందుకే పోశమల్లన్న ఇన్లగూడ ఫిరీగనే జేస్తం’ అని శెప్పవట్టిర్రు డాక్టర్లు. ‘అదేందనడిగితే మీకు తెల్లరేషన్ కార్డుంటే ఐపాయె.. నీకయ్యే దావఖాన కర్సు మొత్తం కేసీఆరే వెట్టుకుంటడని ఇమ్మతిచ్చిర్రు. వాళ్లన్నట్టే నాకు రూపాయి కర్సు గాలె. అంతేగాదు ఏడాది పాటు మందులు గూడ ఉచితంగనే ఇచ్చిర్రు.

పది రోజుల తర్వాత దావఖాన్లకెల్లి ఇంటికొచ్చిన. నెలా, రెణ్నెళ్లు గంగవ్వొక్కతే ఓటల్ నడిపింది. కొన్నొద్దులకు నేను ఓటల్‌కు వోక తప్పలేదు. అప్పట్నుంచి ఓ నాలుగైదేండ్ల దాన్క మంచిగనే పన్జేసుకున్న. 2024 జనవరిల అనుకుంట.. కాంగ్రెస్ ప్రభుత్వం అచ్చినంక నాకు మల్లోపారి ఆటోటాక్ అచ్చింది. అప్పుడు గూడ అపోలో దావఖాన్లకే ఏస్కచ్చిర్రు. ఈ సారి అక్కడి డాక్టర్లు నన్ను శేతవట్టలె. ‘కండిషన్ కొంచెం మంచిగలేదు, జల్ది పట్నం పట్కపోవాల’న్నరు. గంగవ్వ, నా ఇద్దరు కొడుకులు అప్పటికప్పుడు అంబులెన్స్ మాట్లాడుకొని పట్నంల ఉన్న ఓ ప్రైవేటు దావఖానకేస్కచ్చిర్రు. ఈ సారి గుండె మొత్తానికే కరాబైందన్నరు అక్కడి డాక్టర్లు. అగ్గో గుండె కరాబైతే మనిషెట్ల బతుకుతడనుకుంటున్నరా? మనుషుల్ని నడిపిచ్చేదాన్కి ఇప్పుడు మర యంత్రాలొస్తున్నయి గదా? గట్లనే నా గుండె పక్కపొంటి ఓ మిషన్ వెట్టిర్రు పట్నం డాక్టర్లు. కనీ, దానికి 12 లచ్చల రూపాల కర్సయింది. ‘ఏ కర్సు గురించి బాధపడకే పోశమల్లన్న, మనకు కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నద’ని భరోసా ఇచ్చిండు నన్ను సూసేటందుకు దావఖానకొచ్చిన ఓ కాంగ్రెస్ నాయకుడు. పర్లేదని మన్సులనుకున్న. ‘దావఖాన బిల్లులు తెచ్చి నాకియ్యి. సీఎంఆర్ఎఫ్ కింద నీకు 12 లచ్చల రూపాలు ఇప్పిస్తా’ అని తిర్మలాపూర్‌కు వోయిండు. పట్నంల ఆప్రీషనై ఆర్నెల్లయితున్నది. నేను ఓటల్ల చాయ్ జేస్తున్న. నా ఫోన్ రింగయ్యింది. ఎవ్వలా అని ఎత్తి ‘హలో’ అన్న. ‘నేను ఎమ్మెల్యే ఆఫీసులకెల్లి మాట్లాడుతున్న, మాట్లాడేది జెల్ల పోశమల్లన్ననేనా?’ అని అడుగవట్టింది ఔతలామె. నాకు తెగ సంబురమై ‘చెప్పు మేడం’ అంటే.. ‘మీకు సీఎంఆర్ఎఫ్ కింద అరవై వేల రూపాలొచ్చినయి’ అన్జెప్పింది ఆ మేడం. నాకొక్కసారి మిషన్ ఆగిపోయినంత పనైంది. ‘అద్దవ్వా మీ పైసల్. 12 లచ్చ ల రూపాలు కర్సయితే, మీరిచ్చేది అర వై వేలా? మీరిచ్చే పైసలు మిత్తికే సాల యి, అవి మీరే ఉంచుకోర్రిగ’ అని ఫోన్ కట్జేసిన. మా గంగవ్వ పక్కపొంటే ఉన్న ది. ‘ఏమైందుల్లా గంతగనం కోపానికొస్తున్నవ్’ అని అడుగవట్టింది. పాపం గంగవ్వ బాధ గంగవ్వది.



# ఈ అనారోగ్య సమస్యలు ఉన్నవారు చికెన్‌ను అసలు తినకూడదు..!



మాంసాహార ప్రియులు చాలా మంది చికెన్ అంటే ఎంతో ఇష్టంగా తింటుంటారు. ఆదివారం వచ్చిందంటే చాలు చికెన్‌తో ఏ వెరైటీ చేసుకుని తిందామా అని ఎదురు చూస్తుంటారు. ఇక బంధువులు వచ్చినప్పుడు సరే సరి. మాంసాహారం లేనిదే ముద్ద దిగదు. వారాంతాల్లో మాత్రమే కాకుండా వారం మధ్యలోనూ చికెన్‌తో వంటకాలు చేసి లాగించేవారు కూడా చాలా మందే ఉన్నారు. అయితే చికెన్ తినడం వరకు బాగానే ఉంటుంది కానీ కొందరు మాత్రం చికెన్‌ను అసలు ముట్టకూడదని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. పలు అనారోగ్య సమస్యలు ఉన్నవారు చికెన్‌ను తినకూడదని వారు అంటున్నారు. చికెన్‌ను అసలు ఎవరు తినకూడదు.. అన్న వివరాలను వారు తెలియజేస్తున్నారు.

### అలర్జీలు ఉన్నవారు..

పౌల్ట్రీ.. అంటే కోళ్ల ఉత్పత్తులు అంటే అలర్జీలు ఉన్నవారు చికెన్‌ను తినకూడదు. చికెన్ అంటే కొందరికి అలర్జీ ఉంటుంది. అలాంటి వారు చికెన్‌ను తినకూడదు. తింటే శరీరంపై దద్దుర్లు ఏర్పడుతాయి. దురదలు వస్తుంటాయి. ఇలా వస్తున్నాయంటే అలాంటి వారు చికెన్‌ను తినకపోవడమే మంచిది. అయితే ఈ లక్షణాలు కొందరిలో చాలా తక్కువగా ఉండవచ్చు. కొందరికి అధికంగా కనిపిస్తాయి. కనుక అలర్జీ ఉన్నవారు చికెన్‌ను తినకూడదు. కొందరికి చికెన్‌ను తిన్నప్పుడల్లా విరేచనాలు అవుతుంటాయి. కడుపు నొప్పి వస్తుంటుంది. అయినప్పటికీ వారు చికెన్‌ను తినడం మానరు. కానీ అలాంటి లక్షణాలు కూడా అలర్జీ కిందకే వస్తాయి. కనుక వీరు కూడా చికెన్‌ను తినకూడదు. లేదంటే తీవ్రమైన ప్రాణాపాయ పరిస్థితులు తలెత్తే అవకాశాలు ఉంటాయి.

### గౌట్ సమస్య ఉంటే..

కొందరికి గౌట్ సమస్య ఉంటుంది. శరీరంలో యూరిక్ యాసిడ్ అధికంగా పేరుకుపోతే గౌట్ వస్తుంది. దీని వల్ల కీళ్లలో స్ఫటికాలు ఏర్పడి వాపులకు గురవుతాయి. నొప్పి వస్తుంది. అయితే గౌట్ సమస్య ఉన్నవారు చికెన్‌ను తినకూడదు. వీరు అసలు మాంసం ముట్టకూడదు. లేదంటే శరీరంలో యూరిక్ యాసిడ్ అధికంగా ఉత్పత్తి అయి గౌట్ సమస్య మరింత పెరుగుతుంది. అప్పుడు నొప్పి, వాపులు ఇంకా ఎక్కువవుతాయి. కొందరికి కిడ్నీలు చెడిపోయి ప్రాణాపాయ పరిస్థితి తలెత్తే అవకాశాలు ఉంటాయి. కాబట్టి గౌట్ ఉన్నవారు కూడా చికెన్ జోలికి వెళ్లకూడదు. అలాగే కిడ్నీ వ్యాధులు ఉన్నవారు కూడా చికెన్‌ను తినకపోవడమే మంచిది. లేదంటే కిడ్నీలు చెడిపోయే ప్రమాదం ఉంటుంది. శరీరంలో చేరే వ్యర్థాలను బయటకు పంపేందుకు కిడ్నీలు శ్రమిస్తాయి. ఇలాంటి తరుణంలో మాంసాహారం తినడం మంచిది కాదు. కాబట్టి కిడ్నీ వ్యాధులు ఉన్నా కూడా చికెన్‌కు దూరంగా ఉండాలి.

### అధిక కొలెస్ట్రాల్..

అధిక కొలెస్ట్రాల్ సమస్యతో బాధపడుతున్నవారు కూడా చికెన్ తినకపోవడమే మంచిది. చికెన్‌లోనూ కొలెస్ట్రాల్ ఉంటుంది. దాన్ని తింటే ఆ కొలెస్ట్రాల్ మన శరీరంలో చేరుతుంది. ఆరోగ్యవంతులు అయితే ఫర్వాలేదు. కానీ అధిక కొలెస్ట్రాల్ ఉన్నవారిలో కొలెస్ట్రాల్ మరింత ఎక్కువవుతుంది. ఇది గుండె జబ్బులను కలగజేస్తుంది. హార్ట్ ఎటాక్ కు కారణం అవుతుంది. టైప్ 2 డయాబెటిస్ వచ్చేలా చేస్తుంది. కనుక కొలెస్ట్రాల్ అధికంగా ఉన్నవారు చికెన్‌ను తినకూడదు. అలాగే గర్భిణీలు చికెన్ తినే విషయంలో డాక్టర్ సలహా తీసుకోవడం మంచిది. చిన్నారులకు చికెన్ పెట్టే ముందు తల్లిదండ్రులు వైద్యుల సలహాను పాటిస్తే మంచిది. వారికేమైనా అలర్జీలు ఉంటే చికెన్‌ను పెట్టకూడదు.

# చేజారిన జ్ఞాపకం‘మానస



నీ గురించి అడిగింది బాటసారీ! వీలైతే ఓసారి వచ్చివెళ్లమని చెప్పింది!’.. నా ఫ్రెండ్ సుజన చెప్పిన మాటలతో వైజాగ్ ప్రయాణానికి సిద్ధమయ్యా!‘ఇక కనిపించదు’ అనుకున్న మానస.. తన మనసులో నాపైన కాసింత ప్రేమని ‘ఇం..కా..’ కలిగి ఉందనే ఊహనిచ్చిన సుజన మాటలు మొన్నటినుంచీ నన్ను నిద్రకు దూరంచేశాయి.అప్పుడెప్పుడో మానసతో కలిసి చేయాలనుకున్న ‘ప్రేమ ప్రయాణం’ విధివశాత్తూ విఫలమై జీవన పయనంలో ఇద్దరమూ దారితప్పిన బాటసారులం అయ్యామనుకున్నాను. కానీ, నా మనసుకు కాసింత దూరంలోనే మానస ఉందన్న వాస్తవం నాలో ఏదో కొత్తశక్తి నింపుతోంది. అవును ‘మానస’ అనే మూడక్షరాలు చాలు. వేసవి వడగాడ్పులను సైతం హిమసమీరాలుగా మార్చే శక్తి ఒక్క మానసకూ, మానసతో గడిపే అమృత క్షణాలకే ఉంది. ముప్పై మూడేళ్ల వయసులో ఐదేళ్ల తర్వాత ఇప్పుడిలా మానసను కలిసేందుకు వెళ్తున్నప్పటికీ.. ఇన్నేళ్లలో మానస గురించిన ఆలోచనలూ, తనతో గడిపిన సంఘటనల తాలూకు జ్ఞాపకాలూ నన్ను చాలాసార్లు ముంచెత్తాయ్! నేను ఏకాంతంగా ఉన్నప్పుడు చదువుకునేది కూడా యూనివర్సిటీలో తనతో పరిచయం తరువాత నేను రాసుకున్న డైరీనే!ఎన్నో సాయంత్రాలు.. యూనివర్సిటీ స్టేడియం మెట్లపై మానసతో కలిసి కూర్చున్నప్పుడు అసురసంధ్యవేళ అస్తమిస్తున్న రవి కిరణాలు నా ఎదురుగా కూర్చున్న మానస ముఖం మీదకు ప్రసరించి పసిడిరంగులో మెరిసిపోతున్నప్పుడు మానస సౌందర్యమంతా సజీవశిల్పమై నా మనోమందిరంలో ప్రతిష్టింపబడిన క్షణాలు.. ఆ క్షణాలు శాశ్వతమై నేను రాసుకున్న డైరీ చదువుతున్నప్పుడు మానస రూపం ప్రతిపేజీలోనూ కనిపించేదెప్పుడూ!

నా భార్య నిద్రలో ఉన్న అపరాత్రో, తను పుట్టింటికెళ్లిన ఏకాంత సమయాల్లోనో.. గతాన్ని డైరీ లోపలి పేజీల్లో వెదుక్కుంటూ ‘మానస’ గురించి ఆలోచిసే మనసంతా మధురమైన ఆర్ద్రతతో నిండిపోయి, ఒక తీయని బాధలాంటి అనుభూతి కలిగేది.కాలం మానసను నానుంచి దూరం చేసిందేమో కానీ కలలు మాత్రం నామీద జాలిపడి ఏ అర్ధరాత్రో, అపరాత్రో నన్ను ఊరడించేందుకు మానసను నా మనసు దగ్గరికి చేర్చేవి.నా ఆలోచనలతో తనకు సంబంధం లేనట్లుగా రైలు వేగంగా పరుగులు పెడుతోంది. ఎదురుసీట్లో పసిపిల్లాడి ఏడ్పుతో ఈ లోకంలోకి వచ్చాను.. మానస ఆలోచనల్లోంచి కూడా! పిల్లాడిని వాడి తల్లి జోకొడుతోంది. సరిగ్గా ‘ఎప్పుడెప్పుడు వైజాగ్ చేరుకుంటామా అని గోలపెడుతున్న నా మనసును నేను జోకొడుతున్నట్లుగా!రైలు కుదుపులకు కిటికీలోంచి వీస్తున్న స్వచ్ఛమైన పిల్లగాలి తోడై మనసుకు హాయిగా అనిపిస్తూంటే మళ్లీ మానస గురించిన ఆలోచనల్లోకి జారిపోయాను. ‘అసలీ ప్రయాణమెందుకు?!’ విచిత్రమైన ప్రశ్న నా మదిలో మెదిలింది.మానస కోసమా? ఆమె ప్రేమ కోసమా? నిజమే! అంతటి సౌందర్యాన్ని అనుభవించకపోతే ప్రేమకు ఫలమేమిటి?ఏంటిటీ నేనేనా ఇలా ఆలోచిస్తోంది? నా ఆలోచన నాకే చిత్రంగా అనిపించింది..! ఎప్పుడైనా మానస మీద నాకు ‘అలాంటి’ ఉద్దేశం కలిగిందా? ఏమో అలాంటి ఉద్దేశం లేదన్న ఆత్మవంచనతో బతికానేమో!మానస కూడా నన్ను చూడాలని ఉందని ‘సుజన’తో అన్నదంటే‘ఈ ఉద్దేశం’తోనే అన్నదేమో! ఆమెకింకా నాపై ఆ ‘ఇది’ ఉన్నదేమో! ఎంతైనా నా కవితలకు ఫిదా అయిపోయి నన్ను గాఢంగా ప్రేమించింది కదా! ఎలా మర్చిపోగల్దు!మానసపై ఇలాంటి ‘కోరిక’ కలగడం ఇదే తొలిసారి కాకపోవచ్చేమో కానీ, ఇప్పుడు కలగటం మాత్రం గమ్మత్తుగా ఉంది! కోరిక కలగడంలో తప్పులేదేమో వీలైతే ఆచరణలో పెట్టాలనుకుంటున్నాను కూడా! ఆ భావమే థ్రిల్లింగ్‌గా ఉంది!ఆలోచనల్లోంచి తేరుకుంటూ కిటికీలోంచి బయటికి చూశాను.దూరంగా కనిపిస్తున్న కొండల మధ్య అస్తమిస్తున్న సూర్యుడు కాషాయరంగులో నెమ్మదిగా, బరువుగా కిందకి జారిపోతున్నాడు. బహుశా పగలంతా తనని అంటిపెట్టుకొని ఉన్న ఆకాశదేవిని వదిలివెళ్లలేక ఆమె నీలిరంగు పైట చెంగులో దాక్కుంటున్నాడేమో అనిపించేలా పడమటి నింగి మొత్తం కొద్దిసేపట్లోనే అరుణకాంతితో నిండిపోయింది.నిజమే.. మానస మాత్రమే కాదు. తనలాగే, తన మనసులాగే ప్రకృతిలోని ప్రతిదీ మధురమేసౌందర్యమయమే!

పెద్ద బంగళా.. పోర్టికోలో ఖరీదైన కారు పార్క్ చేసి ఉంది! అప్పుడు అర్థమైంది మానస స్థాయి ఏ ‘స్థాయి’లో ఉందో?!నేను కనిపించగానే.. మానస కళ్లింత చేసుకొని నావంక అలా చూస్తూండిపోతుందా? లేకసంతోషం పట్టలేక పరిగెత్తుకుంటూ వచ్చి నామీద వాలిపోతుందా? నా అంచనాలన్నీ తప్పని కాసేపట్లోనే అనుభవమైంది!తలుపులు తీసిన మానస.. మెరిసే కళ్లతో క్షణంపాటు నావంక చూసి, తలవంచుకొని కాసేపు నిల్చుండిపోయింది. ఆ తర్వాత “బాగున్నారా ఇదేనా రావడం?” అంది చిరునవ్వుతో.ఆశ్చర్యపోయాన్నేనుఆమె బహువచన సంబోధనకు! తనతో నా స్నేహం కొనసాగుతున్న రోజుల్లో.. ‘ఏమోయ్ బాటసారీ ఈరోజు కవిత ఏ వనిత గురించి రాశావోయ్?’ అంటూ నన్ను ఏకవచనంతో చనువుగా ఆటపట్టించే మానసేనా ఈమె? అనిపించింది.‘ఫణికుమార్’గా కంటే కవిగా ‘బాటసారి’ అనే కలంపేరుతోనే నేను ఎక్కువ పాపులర్!“హలోఏంటలా ఉండిపోయారు?” అంటూ గట్టిగా వినిపించిన ఆమె ప్రశ్నకు గతంలోంచి తేరుకొని ప్రస్తుతానికి వచ్చాను.నేనేదో అనబోయేంతలో “రండి లోపలికి రండి!” అంది లోనికి దారితీస్తూ.ఆమె వెనకే లోపలికి నడిచాను. హాల్‌లో ఉన్న సోఫా చూపిస్తూ

“కూర్చోండి” అంది.

కూర్చోబోతూ చుట్టూరా ఓసారి పరికించి చూశాను. పెద్ద హాలు హాల్‌లోంచి పాములా పైకి పాకుతున్నట్లుగా కనిపిస్తున్న మెట్లతో కూడిన డూప్లెక్స్ నిర్మాణం, గోడలకు ఖరీదైన తైలవర్ణ చిత్రాలు, సీలింగ్ నుంచి హాలు మధ్యలోకి వేలాడుతున్న అధునాతన శాండిలియర్, పొందికగా అమర్చిన సామాన్లతో అందంగా, హుందాగా ఉంది ఇంటీరియర్ డెకరేషన్!తను నా ఎదురుగా కూర్చుంది.‘మానస భర్త బిజినెస్‌మెన్!’ అని చెప్పిన సుజన మాటలు గుర్తొచ్చాయ్. అప్పట్లో పురులు విప్పుకొంటున్నట్లుగా ఉండే ఆమె అందం.. ఇప్పటికి పరిపూర్ణత సంతరించుకున్నట్లుగా అప్పటికంటే ఇప్పుడే నిండుగా, ఆకర్షణీయంగా కనిపిస్తోంది.తలంటుస్నానం చేసిందేమో నిగనిగలాడుతున్న ముంగురులు ఏసీలోంచి వీస్తున్న పవనాలకు సుతారంగా ఎగురుతూ వచ్చి అందమైన ఆమె ముఖాన్ని అలవోకగా ముద్దాడుతున్నాయి. మనిషి ఆసాంతం అద్భుత సౌందర్యంతో, అపురూప లావణ్యంతో మెరిసిపోతోంది.‘ఈమెను పెళ్లి చేసుకోకుండా వదులుకొని పొరపాటు చేశానా?’ అన్న ఆలోచన క్షణంపాటు నా మదిలో మెదిలింది.మానస ముఖంలో కనిపిస్తున్న ఆ ‘పరిపూర్ణతే’ నన్ను కాస్త సంకోచానికి గురిచేస్తోంది. వ్యక్తిత్వం వల్లో, మెచ్యూరిటీ వల్లో వచ్చిన ఆ ‘హుందాతనం’ కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది.‘ఎలాగైనా సరే ఈ సౌందర్యాన్ని ఒక్కసారైనా సొంతం చేసుకోవాలి ఇంతటి లావణ్యాన్ని అనుభవించకపోతే జీవితం వ్యర్థం!’ అనే నిర్ణయానికి వచ్చేశాను.‘ఏమిటీ మానసను నువ్వు నిజంగానే ప్రేమించావా? ప్రేమిస్తే ఇలాంటి ఆలోచనలేంటి?’ అంటూ నా అంతరాత్మ నన్ను నిలదీసింది. కానీ, అది కొద్దిసేపే! ఆమెను చూస్తూంట నాలోని ‘మరోమనిషి’ గెలుస్తున్నట్లుగా అనిపించింది. ఇంతలో“ఎక్స్‌క్యూజ్ మీ జస్ట్ ఎ మినిట్!” అంటూ మానస లోపలికెళ్లింది.

“టీ తీసుకోండి !”

ఆమె చేతిలోని టీకప్పు అందుకుంటూ.. “మీవారు ఇంట్లో లేరా?” అన్నాను.“లేరు. కంపెనీ డైరెక్టర్స్ మీటింగ్ ఉందని నిన్ననే హైదరాబాద్ వెళ్లారు!” అంది నా ఎదురుగా సోఫాలో కూర్చుంటూ.“థాంక్యూ మానసా! నాకు టీనే ఇష్టమని ఇన్నేళ్ల తరువాత కూడా గుర్తుంచుకున్నందుకు!” అన్నాను ఆమె కళ్లలోకి అదోలా సూటిగా చూస్తూ.మానస నవ్వింది..“నాకూ, మావారికీ కూడా టీ అంటేనే ఇష్టం!” అంది క్యాజువల్‌గా! అంతేకాదు.. ‘నీ ఇష్టాన్ని గుర్తుపెట్టుకొని, నీ కోసమేమీ ప్రత్యేకంగా చేసింది కాదు!’ అనే అర్థం వచ్చేలా ఉందామె సమాధానం.నా మనసులో ఏదో విస్ఫోటనం! నాలో ఉవ్వెత్తున ఎగసిపడుతున్న స్వార్థపు కోరికలపై మానస విసిరిన మొదటి అస్త్రానికి కాసేపు కోలుకోలేకపోయాను. అయినా ఏదో ఆశ..‘మానస మరోవ్యక్తికి భార్య అయినా మానసికంగా నాదే!’ అనే బలమైన విశ్వాసం! కప్పు టీపాయ్ మీద పెడుతూ అన్నాను..“మొన్ననే సుజన చెప్పింది. నువ్వు నా గురించి అడిగావని! వీలైతే ఓసారి వచ్చివెళ్లమని నాకు చెప్పమన్నావట కూడా!” అంటూ గుర్తుచేశాను. నేనెందుకు వచ్చానన్న విషయం అస్పష్టంగా ఉంచి!‘నువ్ రమ్మంటేనే వచ్చాను సుమా!’ అన్న అహంకార పూరితమైన మాటలు నావి.“ఔను! మొన్నెప్పుడో సుజన కలిసినప్పుడు మాటల సందర్భంలో మీ ప్రస్తావన వచ్చి ‘బాటసారి ఎలా ఉన్నారు?’ అన్నాను. ‘ఎందుకు?’ అనడిగింది.. సగటు ఆడదాని లాగానే! ‘చాలా కాలమైందిగా చూసి!’ అన్నాను” అంటూ ఆపింది మానస కాకతాళీయంగానే నా గురించి అడిగినట్లు తన మాటల్లో స్పష్టం చేస్తూ.నేను పేర్చుకుంటూ వచ్చిన ఆశాసౌధాలను తన ఒక్కొక్క మాటతో ఒక్కొక్కటిగా కూల్చివేస్తున్నట్లు కనిపిస్తున్న మానస వంక సూటిగా చూడలేకపోయాను. అయినా ఇంత సులభంగా ఓటమిని ఒప్పుకొంటే ‘మగాడిని’ ఎలాగవుతాను? ‘బాటసారి’ని దుకవుతాను??“మనసెలా ఉంది?” ఆడవాళ్లపై నేను తరచూ ప్రయోగించే పడికట్టు వాక్యం వొదిలాను. “పండు వెన్నెలలా, నిండు గోదారిలా, వసంతకాలంలోని పచ్చదనంలా బావుంది!” అంది.నేను ఆశించని.. ఊహించని.. ఎదురుచూడని.. నాకు నచ్చని సమాధానం అది!!“ఎలా ఉంది నీ జీవితం?” అడిగాను.ఆమెలాగా బహువచనంతో సంబోధించి నాకు నేను తనకు దూరం కాదలచుకోలేదు. అంతేకాదు.. ఈ ప్రశ్నతో ‘గతం’గా మారిన మా ప్రేమను ‘వర్తమానం’లోకి తీసుకొచ్చి కనీసం కొన్ని ఘడియలైనా ఆమెను నావైపు తిప్పుకోవాలన్న స్వార్థం!“ప్రస్తుతం నా జీవితంలో ఎలాంటి వెలితీ లేదు చాలా బావుంది!” బదులిచ్చింది మానస.వెంటనే మరో ప్రశ్న సంధించాను.. “..గతంలోని మన ప్రేమ లాగానా?” ఇది తిరుగులేని ప్రశ్న. ఆమె మీద చిన్న ‘గెలుపు’ లాంటి గర్వం నాది. కానీ మానస నవ్వుతూ బదులిచ్చింది. “చాలా పిచ్చిప్రశ్న బాటసారిగారూ! ప్రేమ అనేది ఒక్కొక్కరి హృదయంలో ఒక్కోవిధంగా రూపుదిద్దుకుంటుంది. స్వార్థం లేనిదీ, పవిత్రమైందీ అయితే జీవితమంతా ఉండవచ్చేమో కానీ పూర్తి వంచనతో కూడుకొంది కదా మీ ప్రేమ! ఓ చేదుగుర్తులా నాలాంటి వాళ్ల ఆనందమయ వైవాహిక జీవితానికి మునుపు వేసిన తప్పటడుగులోంచి నేర్చుకొనే ఓ చక్కటి గుణపాఠంలా మిగుల్తుంది. అయితే..